www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 241 మంగళవారం, మే 26, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం



- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్‌గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే 25 :** తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికం గా కోటీశ్వరులను చేసేందుకు మిగతా2లో...

# అట్టహాసంగా పద్మ పురస్కారాలు

- పలువరికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి
- కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు



**న్యూఢిల్లీ,మే 25:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది మిగతా2లో...

# బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటూనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్,మే 25:** బీఆర్ఎస్ అధికారం లోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ మిగతా2లో...

# అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం
- రెండు రాష్ట్రాల త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విధంగా చర్యలు: మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్,మే 25 :** నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ మిగతా2లో...

# సొంత చెల్లెలు, బావ ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

- ఇందిరమ్మ ఇళ్లు ఉంటున్న వారిని అడిగితే తెలుస్తుంది
- కెటిఆర్ సవాల్‌కు మంత్రి పొంగులేటి ప్రతి సవాల్




# ముంచుకొస్తున్న ఎబోలా ముప్పు

- అప్రమత్తం అయిన కేంద్ర ప్రభుత్వం
- అధికారులతో సమీక్షించిన జెపి నడ్డా




# ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- మిగతా ధాన్యం కూడా కొనడానికి ప్రభుత్వం సిద్ధం
- కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు
- బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల



**ఖమ్మం,మే 25 :** దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో మిగతా2లో...

# నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

- గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోని ఎన్‌టిఎ
- సుప్రీం ధర్మాసనం అసహనం




**న్యూఢిల్లీ,మే 25 :** దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం మిగతా2లో...

# ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

- ఈ యేడు మొక్కజొన్న అధికంగా దిగుబడి
- సిపిఐ బృందంతో సిఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్,మే 25** కేందప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యింది. సీఎంని కలిసిన వారిలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం, పశ్య పద్మ , ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. కార్మికులకు కనీస వేతనాల మిగతా2లో...

# పెట్రో ధరల పెంపు ఎవరి కోసం..?



- ఎవరి లాభంకోసం ధరలు పెంచుతున్నారు
- కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ,మే 25** శంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, మిగతా2లో...

## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనారాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

## అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా -కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి, శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించబోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిన్నరలోనే కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 24 గంటలు మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్వేల ఆధారంగా కార్పొరేటర్లకు టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో 3.39 కోట్ల ఓటర్లు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మన పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రతి ఓటు విలువైనదే.. నా పోలింగ్ బూత్ నా బాధ్యత అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు సుఖంగా జీవించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తమ హయాంలో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. పేదలు తెలియక ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుంటే జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చామని అన్నారు. రెండున్నర లక్షల మంది పేదలకు పట్టాలు ఇచ్చిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ శనివారం, ఆదివారం నాడు ఇండ్లు కూలగొట్టారని కేటీఆర్ మండిపడ్డారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ ఇంటికి హైడ్రా అధికారులు నోటీసులు అంటించారని.. ఇల్లు పోతుందనే భయంతో ఆ మహిళ ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టలేదు.. కానీ కూలగొట్టిన ఇండ్లు వేలల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే ఇండ్లు కూలగొట్టే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రీ అంటే ఇళ్లను కట్టాలి కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఇళ్లను కూలగొడుతున్నాడని మండిపడ్డారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించు కున్నారని.. తెలంగాణలో మాత్రం ఆ దరిద్రాన్ని తెచ్చుకున్నామని అన్నారు. దొంగ గ్యారంటీ కార్డులతో కొంప ముంచారని మండిపడ్డారు. కేసీఆర్ కల్యాణ లక్ష్మీకి రూ.లక్ష ఇస్తే.. కాంగ్రెస్ వాళ్లు అదనంగా తులం బంగారం ఇస్తామని అన్నారని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ఒక్క రూపాయి అయినా పెన్షన్ పెంచిందా అని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్దితి ఉందని అన్నారు. కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఎ÷-లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ – ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామచంద్రుడు నడయాడిన ప్రాతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితమయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు. ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

## ముంచుకొస్తున్న ఎబోలా ముప్పు

**న్యూఢిల్లీ,మే 25 :** ఎబోలా వైరస్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తాజాగా ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇక ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. జ్వరం, వాంతులు, అకారణ రక్తస్రావం, తలనొప్పి, వంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఎయిర్‌పోర్టు హెల్త్ ఆఫీసర్‌కు ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే వెల్లడించాలని స్పష్టం చేసింది. ఎబోలా కేసులు అధికంగా ఉన్న డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సుడాన్‌కు వెళ్లవద్దని కేంద్రం ఇప్పటికే భారతీయులకు సూచించింది. ఎయిర్‌పోర్టుల్లో నిఘాను కట్టుదిట్టం చేశారు. లెబొరేటరీలు, క్వారంటైన్ వసతులను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, ఆఫ్రికాలో ఇప్పటివరకూ 900లకు పైగా ఎబోలా అనుమానిత కేసులు వెలుగు చూశాయని డబ్ల్యూహెచ్ఓ తాజాగా వెల్లడించింది. 101 కేసుల్లో ఇప్పటికే వ్యాధి నిర్ధారణ అయ్యిందని వెల్లడించింది. ఇక యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రకారం, ఎబోలా వ్యాప్తి ఎక్కువగా ఉన్న డీఆర్‌సీ దేశంలో 904 అనుమానిత కేసులు వెలుగులోకి రాగా 101 మంది రోగుల్లో ఎబోలా వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఇప్పటికే 119 మంది ఎబోలా వల్లే మరణించినట్టు అనుమానాలు ఉన్నాయి. మరో 10 కేసుల్లో ఎబోలా వల్లే మరణాలు సంభించిందని కూడా పరీక్షల్లో తేలింది. 24 వరకూ ఉన్న వివరాల ప్రకారం, ఉగాండాలో 5 నిర్ధారిత కేసులు, ఒక ఎబోలా మరణం వెలుగులోకి వచ్చింది. ఆఫ్రికా దేశాల్లో జాతీయ స్థాయిలో ఎబోలా వ్యాప్తి చెందే రిస్క్ ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. ప్రపంచస్థాయి వ్యాప్తి ముప్పు కొంత తక్కువగా ఉందని పేర్కొంది.

## నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంను చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం..?

(మొదటి పేజీ తరువాయి)

డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ధాన్యం సేకరణ, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లు చేయడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## సొంత చెల్లెలు, బావ ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

**హైదరాబాద్,మే 25** సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కేటీఆర్ అంటూ సవాల్ చేశారు.

ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందన్నారు.

జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాం.

రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు గారు... అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో మీకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు సున్నా ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నారు. మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు!

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు

# పస్రా అంగన్‌వాడీలో వంటల పండుగ

**.99 రోజుల ప్రణాళికలో ఫుడ్ డెమాన్‌స్ట్రేషన్.**
**.తల్లులకు గర్భిణిలకు అవగాహన.**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 25( పీపుల్స్ న్యూస్):** గోవిందరావుపేట మండలం పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని పస్రా ఫోర్ అంగన్‌వాడీ కేంద్రంలో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా సోమవారం ఫుడ్ డెమాన్‌స్ట్రేషన్ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉండే ఆహార పదార్థాలను తయారు చేసి చూపించారు. ఈ వంటకాల తయారీ, వాటి ఉపయోగాలపై గర్భిణులు, బాలింతలు, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా నువ్వులు, బెల్లం, పల్లీలతో లడ్డూలు, బెల్లం–బియ్యం–పాలతో పులగం, బాలామృతంతో ఇడ్లీ, లడ్డూ తయారు చేశారు. బెల్లంతో మరమరాల ఉండలు, రాగి, కొర్రలతో జావ వంటి వంటకాలు చేసి చూపించారు. స్థానికంగా దొరికే వాటితోనే పోషకాహారం అందుతుందని టీచర్లు తెలిపారు.అంగన్‌వాడీ ఆయాలు, తల్లులు కలిసి ఈ వంటకాలు తయారు చేశారు.ఈ కార్యక్రమంలో టీచర్లు పి.రాజ్యం, ఏ.కల్పన, కే.రాధిక, పద్మారాణి, పద్మావతి, భాగ్య, సరిత, రమాదేవి, జ్యోతి,తల్లులు,గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి

**ప్రతి మండలానికి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి**
**సిపిఐ ఎంఎల్ భూపాలపల్లి జయశంకర్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్**



**చిట్యాల ప్రతినిధి మే 25 (పీపుల్స్ న్యూస్):** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది సందర్భంగా మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లాలో అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని వ్యవసాయ అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి అరటి తోట మిరప మక్కలు కాలిపోయిన రైతులకు ప్రభుత్వ అధికారులు అండగా నిలిచి సమగ్రమైన సర్వే నిర్వహించి ప్రభుత్వం దిష్టికి తీసుకపోవాలని కోరుతున్నాం అగ్ని ప్రమాదంలో చనిపోయిన రేపాక పల్లెదంపతులకు 20 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అగ్నిప్రమాదం నుంచి కాపాడాలని కోరుతున్నాం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులను రైతుల ఆదుకోవాలని కోరుతున్నాం . ఈ సమావేశంలో నాయకులు బంధు క్రాంతి సుజాత ఆత్మూరిశ్రీకాంత్ స్వాతి పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి


**అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి.**
**జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రతినిధి మే 25( పీపుల్స్ న్యూస్):** జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలు జరిగే ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య సిబ్బంది, అంబులెన్స్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి.ఎస్.పి కిశోర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా కేంద్రంలో ఐదు రూపాయల భోజనం క్యాంటీన్ ఓపెన్ చేయాలి

**గ్రీవెన్స్ లో కలెక్టర్ కార్యాలయఅధికారి కి వినతిపత్రం ఇచ్చిన**
**ప్రజా సంఘాల నాయకులు గుండెబోయిన రవిగౌడ్**
**గుండ మీది వెంకటేశ్వర్లు**




**ములుగు జిల్లా ప్రతినిధి మే 25 (పీపుల్స్ న్యూస్)** ములుగు జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణంలో మునిసిపాలిటీ తరఫున ఐదు రూపాయల భోజనం కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు గుండబోయిన రవి గౌడ్ గుండ మీది వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు సోమవారం గ్రీవెన్స్ లో కలెక్టర్ కార్యాలయఅధికారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు కొత్తగా మున్సిపాలిటీ అయినందున క్యాంటీన్ ఓపెన్ చేయాలని వారన్నారు. జిల్లా కేంద్రానికి 10 మండలాల ప్రజలు సుధీర ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తుంటారని వారు భోజనం చేయాలంటే 100 నుండి 200 వరకు అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలుఆకలి తో అలమటిస్తూ ఉన్నారని వారు అన్నారు. పేద ప్రజల కోసం జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ కేంద్రంగా తక్షణమే ఐదు రూపాయల భోజనం క్యాంటీన్ ఏర్పాటుచేసి పేదలప్రజల ఆకలి తీర్చాలని జిల్లా కలెక్టర్ కు కమిషన్ కు విజ్ఞప్తి చేశారు.

# మండే కాలం.. మహిళలపై ప్రభావం!

**ములుగు జిల్లా ప్రతినిధి మే 25(పీపుల్స్ న్యూస్ ):** తారెత్తిస్తున్న ఎండలకు భూమి విపరీతంగా వేడెక్కుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా వడగాలులు వీస్తున్నాయి. ఈ విపరీతాలన్నీ వాతావరణంలో వస్తున్న మార్పులు మాత్రమే కాదు..ఈ వేడి మహిళల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మండే ఎండల్లో కుటుంబం గడవడం కోసం కూలీనాలీ చేసుకునే మహిళలు మనచుట్టూ ఎంతోమంది. ఎండల వల్ల ఆ మహిళలు ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఈ ప్రభావం వారి పునరుత్పత్తి సామర్థ్యంపై పడుతోంది. ముందస్తు ప్రసవాలు సంభవిస్తున్నాయి. “వడగాలుల ప్రభావం వల్ల కలిగే దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు మహిళలే ఎక్కువశాతం గురవుతున్నారు. ఈ కారణంగా సంభవించే మరణాల్లో కూడా వారి సంఖ్య పెరుగుతోంది” అని 2024లో భారత వాతావరణ శాఖ ప్రచురించిన అధ్యయనంలో తేలింది.ఎండలకు గొంతు తడారిపోతున్నా కాసిన్ని నీళ్లు తాగలేని పరిస్థితి షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్నారు. అలా ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న నారాయణమ్మ తన అనుభవాన్ని ఇలా చెప్పింది. “ఉదయం పది గంటలకు షాపునకు వెళతాను. అన్నం బాక్సుతో పాటు నీళ్ల సీసా తీసుకెళతాను. బయట భగ్గుమంటున్న వేడికి సీసాలో నీళ్లు కాలిపోతున్నాయి. దాహం వేసినప్పుడు వాటిని తాగలేం. షాపులో ఎక్కడో మంచినీళ్లు ఉంటాయి. పదే పదే అక్కడికి వెళ్లడం కుదరదు. ఎప్పుడో మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు చల్లని నీళ్లు తెచ్చుకుని తాగుతాను” అంటోంది. ఈ పరిస్థితి నారాయణమ్మ ఒక్కదానిదే కాదు; పెద్ద, చిన్నా మాల్స్‌లో పనిచేస్తున్న ఎంతోమంది మహిళలది. ఎండాకాలం వదులైన దుస్తులు ధరించాలి. కానీ షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలకు ఆ సౌలభ్యం ఉండదు. ఈ కారణంగా కూడా వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.మన దేశంలో చాలీచాలని గదులలో, నెత్తికి చూరు తగులుతున్న ఇళ్లల్లో నివసించే వారు అనేకమంది ఉంటారు. అరవై ఏళ్ల విజయమ్మ తాడేపల్లి సుందరయ్య కట్ట మీద ఓ చిన్న రేకుల ఇంట్లో నివసిస్తోంది. “మూడేళ్ల నుండి ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి” అంటోంది. “వేడి తట్టుకోలేక పొరుగింట్లోకి వెళ్లి తలదాచుకుంటున్నా” అని చెబుతోంది. “ఇంట్లో ఉన్నా బయట ఉన్నా ఒకేలా ఉంది. సాయంత్రం అయ్యేసరికి ఎక్కడ లేని నీరసం వచ్చేస్తోంది” అని ఆయాసపడుతూ చెబుతోంది. విజయమ్మ లాంటి గృహిణులు ఎంతోమంది ఇళ్లల్లో ఉండి కూడా వడదెబ్బకు గురవుతున్నారు.
ఈ కాలంలో పొలం పనులు చేసే మహిళలు ఎండలోనే పనిచేయాలి. అయితే నిప్పులు చెరుగుతున్న ఎండలో పనిచేయలేక వారంతా చీకటితో పొలం పనులకు వెళ్లాల్సి వస్తోంది. కుంచనపల్లి పసుపుతోటలో పనికి వెళ్తున్న రమణమ్మ



ఈ పరిస్థితి గురించి ఇలా చెప్పింది. “తెల్లవారుజాము 4 గంటలకే నిద్ర లేచి ఇంటి పనులు పూర్తి చేసుకుంటాను. 5 గంటలకల్లా రోడ్డు మీదకు వెళ్లాలి. పనోళ్ల కోసం ఆటో వస్తుంది. అది తప్పితే ఆ రోజు పనికి వెళ్లడం కుదరదు. ఆదరాబాదరా పని చేసుకుని వెళతాను. ఉదయం 11 గంటల వరకు పని చేస్తాం. మధ్యాహ్నం అక్కడే ఉండిపోయి సాయంత్రం మళ్లీ పనిలోకి వెళు తున్నాం. రాత్రి 9:30, 10 గంటల వరకు కూడా పని చేసి వస్తున్నాం” అంటోంది. “ఈ ఒత్తిడి నీ ఆరోగ్యాన్ని ఎంతలా ప్రభావితం చేస్తోంది” అన్నప్పుడు రమణమ్మ కళ్లల్లో నీటి చెమ్మ కనిపించింది. “ఒకటే దడగా ఉంటది. ఇంటి పని, పొలం పని చేయడం అలవాటే. కానీ ఎండాకాలం వస్తే చాలు పరుగులు పెడుతూ పనులు చేయాలి. దాని వల్ల నా ఒళ్లు గుల్లవుతోంది” అంటోంది.

**మహిళల్లో మరణాల రేటు పెరిగింది!**

ఈ మహిళలు వ్యక్తపరచిన ఈ అభిప్రాయాలు దేశంలో కోట్లాది మంది మహిళల వాస్తవ జీవితాలను మన కళ్లముందు ఉంచుతున్నాయి. 2024లో వెల్లడించిన అధ్యయనం ప్రకారం 1980–2000 మధ్య భారతదేశంలో తేమతో కూడిన ఉష్ణోగ్రత తీవ్రత 30 శాతం పెరిగింది. ఈ తీవ్రత ఇప్పుడు మరింత వేగం అయ్యింది. పెరుగుతున్న ఈ ఉష్ణోగ్రతల తీవ్ర ప్రభావాన్ని పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా ఎదుర్కొంటున్నట్లు నివేదికలో తెలిపారు. ఉష్ణోగ్రత మార్పుల కారణంగా పురుషులలో మరణాల రేటు 23.11% (2000–2010), 18.7% (2010–2019) మేర తగ్గినట్లు నివేదికలో తేలింది. అయితే ఈ రెండు కాల వ్యవధులలో స్త్రీల మరణాల రేటు వరుసగా 4.63%, 9.84% మేర పెరిగింది.పెరుగుతున్న ఈ వేడికి మహిళల శరీరాలు భిన్నంగా స్పందిస్తాయి. హార్మోన్ల హెచ్చు తగ్గులు, జీవక్రియ రేట్లు, శరీర నిర్మాణం అన్నీ శరీరం ఎదుర్కొనే వేడిని ప్రభావితం చేస్తాయి. దీనివల్ల డీహైడ్రేషన్, అలసట, వేడి సంబంధిత అనారోగ్యాలకు ఎక్కువగా గురవుతారు. ఈ ప్రభావం గర్భిణీలను ఎక్కువ ప్రమాదాలకు గురిచేస్తుంది. తీవ్రమైన వేడి, నెలలు నిండక ముందే ప్రసవాలు, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, మృత శిశు జననాలు పెరగడం, తల్లి అనారోగ్య సమస్యలు ఎక్కువ అవడానికి కారణమవుతుంది. దేశవ్యాప్తంగా జరిగిన అధ్యయనాలు ఈ విషయాలపై పదే పదే హెచ్చరిస్తున్నాయి.
వాతావరణ మార్పుల్లో ప్రస్తావన లేదు వడగాలులు మహిళల ఆరోగ్యంపై ఇంతలా ప్రభావం చూపుతున్నా వాతావరణ విధానాల్లో ఎక్కడా వాళ్ల ప్రస్తావన ఉండడం లేదు. తీవ్రమౌతున్న వేడి మహిళలు, పేదరికం, శ్రమ, గృహవసతి, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలతో ముడిపడిన అంశంగా గుర్తించాలి. వడగాలుల ప్రభావం కేవలం మరణాల గణాంకాలకే పరిమితం కాదు. వడదెబ్బ, డీహైడ్రేషన్, గుండె సంబంధిత సమస్యలు, మూత్రపిండాల రుగ్మతలు, మానసిక ఒత్తిడి, పని సామర్థ్యం తగ్గడం వంటివన్నీ సుదీర్ఘ కాలంలో ఎదురయ్యే సమస్యలు.
ప్రపంచంలో అత్యధిక వేడిమికి గురయ్యే దేశాలలో మన దేశం ఒకటి. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) ప్రకారం ప్రపంచ సగటు కంటే దక్షిణాసియా వేగంగా వేడెక్కుతోంది. మన దేశంలో ఒక్క రోజు జీతం రాకపోతే కూడా కుటుంబాన్ని పోషించుకోలేని కుటుంబాలు ఎక్కువ. ఆ కుటుంబాల్లోని కోట్లాది మంది మహిళలు కనీస మౌలిక వసతులు లేని పని ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. పెరుగుతున్న ఈ ఉష్ణోగ్రతలు వాళ్ల పరిస్థితిని మరింత దిగజారుస్తున్నాయి.

**ఇంట్లో, బయటా ఒకేలాంటి పరిస్థితి!**

మన దేశంలో అనేక చోట్ల మహిళలు ఇంటి అవసరాలకు కిలోమీటర్ల కొద్దీ ఎండలో నడిచి నీళ్లు సేకరిస్తారు. పంట కోయడం, పశువులను సంరక్షించడంలో కూడా మహిళల భాగస్వామ్యం ఎక్కువ. పనులకు వెళ్లే మహిళలే కాదు, ఇంట్లో ఉండే మహిళలు కూడా ఒకేలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ ఎండల్లో పిల్లల సంరక్షణ, ఇంటి నిర్వహణ మహిళలపై అదనపు భారాన్ని తెచ్చిపెడుతోంది.
ప్రపంచవ్యాప్తంగా పలు అధ్యయనాలు ఎక్కువకాలం వేడికి గురవ్వడం ఆందోళన, నిద్రలేమి, భావోద్వేగ ఒత్తిడి, మానసిక క్షోభ పెరగడానికి కారణమవుతుందని చెబుతున్నాయి. ఈ వేడి కారణంగా మహిళలకు ఆరోగ్య పరంగానే కాదు, సన్నిహిత భాగస్వాముల నుండి ఎదుర్కొనే హింస కూడా తీవ్రమవుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి నేపాల్ (14.8), పాకిస్తాన్ (5.9) శాతాలతో పోలిస్తే భారత్‌లో (23.5) శాతానికి ఈ హింస పెరుగుతుందని నిపుణులు అంచనా వేశారు. “ఇక నుండి వాతావరణ మార్పు గురించి మాట్లాడేటప్పుడు ఉష్ణోగ్రతల్ని మాత్రమే కాదు, ఆ వేడిని మోస్తున్న మహిళల జీవితాల్ని కూడా చూడాలి” అని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

# ఐకెపి సెంటర్స్ లో ఇంచార్జిల హావా..

**పైసలు ఇస్తే లోడ్ లేకుంటే లేదు..**
**వరి, మక్కల కొనుగోలు కేంద్రాల్లో అక్రమ వసూళ్లు ..**
**చోద్యం చూస్తున్న అధికారులు..**
**అక్రమ వసూళ్లలో అధికారుల వాటా ఎంత?.**
**అవస్థలుపడుతున్న రైతులు..**
**ఎమ్మార్పీఎస్(టీ ఎస్ ) జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ..**

**టేకుమట్ల ప్రతినిధి మే 25 (పీపుల్స్ న్యూస్):** టేకుమట్ల మండలంలోని ఐకెపి సెంటర్స్ లో సెంటర్ ఇంచార్జిలు హవా చేస్తున్నారని, వరి, మక్కల కొనుగోలు కేంద్రాల్లో పైసలు ఇస్తేనే రైతుల దాన్యాన్ని లోడ్ చేస్తున్నారని, పైసలు ఇవ్వకుంటే రైతుల దాన్యాన్ని లోడ్ చేయకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మార్కెటింగ్ శాఖ



అధికారులకు కూడా వాటా ఇస్తున్నామని బెదిరిస్తున్నారని,సెంటర్ ఇంచార్జిలు మార్కెటింగ్ అధికారుల పేరు చెప్పి మరీ రైతుల దగ్గర పైసలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎం చేయలేని అయోమయ పరిస్థితుల్లో రైతులు పైసలు ఇస్తున్నారని, ఇంత తతంగం జరుగుతున్న సంబంధిత మార్కెటింగ్ అధికారులు నిమ్మకు నీరేత్తి నట్లు వ్యవహారిస్తున్నారని, అక్రమ వసూళ్లలో అధికారుల వాటా ఎంత? అని ప్రశ్నించారు.వర్షాకాలం దగ్గరికి వచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోవడం మూలంగా రైతులు అనేక అవస్థలుపడుతున్నారని ఇకనైనా స్థానిక శాసనసభ్యులు,జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి ఈ అక్రమ వసూళ్లపై విచారణ జరిపించి, రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో చిలుక కుమార్, గజ్జి రాజయ్య, దాసారపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు..

# కలెక్టర్ సారు ముస్లింలను కాపాడండి

**ముస్లింల కబరస్తాన్ మజీద్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి**
**ఖబరస్తాన్, మసీద్ నిర్మాణం అయి ఉన్న భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి**
**మసీద్ వ్యవస్థాపక అధ్యక్షులు సర్వర్ అహ్మద్**

**ములుగు జిల్లా ప్రతినిధి మే 25 (పీపుల్స్ న్యూస్):** కలెక్టర్ సారు ముస్లింలను కాపాడాలని మసీదు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ సర్వర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు.ములుగు జిల్లా వెంకటాపూర్ రామప్ప మండలం లక్ష్మీదేవి పేట లోని వక్ బోర్డ్ భూములకు రక్షణ లేకుండా పోవడంతో ముస్లింలందరూ ఆందోళన కు గురవుతున్నామని ఆయన వాపోయారు. కబరస్తాన్, మజీద్ చెందిన పవిత్ర వక్ బోర్డ్ ఆస్తులను కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకొని నిర్మాణాలు చేపట్టడం, వెంచర్లుగా మార్చి, విక్రయాలకు పాల్పడడం ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు.ముస్లింల కబరస్తాన్ భూమిని 1995వ సంవత్సరంలో లక్ష్మీదేవి పేట గ్రామానికి చెందిన తక్కల్లపల్లి శ్రీనివాసరావు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా వారి యొక్క సొంత భూమిని ముస్లిం కులస్తులకు సర్వేనెంబర్ 4, 5 లలో 0.20 గుంటలు భూదానం కింద ఇచ్చినారు. ఆ భూమిలో ముస్లిం కులస్తులు ఎవరు చనిపోయిన ఆ స్థలంలోనే ఖననం చేసుకుంటున్నామని, అట్టి స్థలంలోనే మసీదు నిర్మించుకొని దైవ ప్రార్థనలు చాలా కాలం నుండి చేసుకుంటున్నామన్నారు మా ముస్లిం సాంప్రదాయం ప్రకారం మసీద్, కభరస్తాన్ ,మదర్స, ములిసాబ్ రూమ్, వజుఖన లు వంటివి నిర్మించు కున్నమన్నారు. మజీద్, ఖబరస్తాన్ అభివృద్ధి కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోగా, వక్ బోర్డులో నమోదు కాగా నిధులు కూడా మంజూరు అయినాయన్నారు. ఇటీవల మంత్రి సీతక్క వచ్చి మసీదును ప్రారంభించగా,. మాకు భూదానం ఇచ్చినప్పటినుండి అభివృద్ధి కోసం గ్రామపంచాయతీ నుండి పర్మిషన్ ఇచ్చి తీర్మాన కాపీలు కూడా ప్రజల సమక్షంలో ఇవ్వడం





జరిగిందన్నారు. మాకు భూదానం ఇచ్చిన భూమిని 28. 8 .2025 న అక్రమంగా తప్పుడు కాగితాలు సృష్టించి పట్టా చేసుకొని కోర్టు ద్వారా (ఒకటి) గుండపనేని పద్మజ భర్త సురేష్ రావు (రెండు) దగ్గు విజయ భర్త హనుమంతరావులు, కొంతమంది తప్పుడు ఆలోచనతో బెదిరిస్తూ, ఇబ్బంది పెడుతున్నారాని, ముస్లిం కులస్తుల మనోభావాలను దెబ్బతీస్తూ కులాన్ని అవమానపరచడంతో మేము అందరం బయో ఆందోళనతో జీవనం కొనసాగిస్తున్నా మన్నారు. కాగా కబరస్తాన్ ,మసీద్ భూములు తెలంగాణ రాష్ట్ర వర్ఫ్ బోర్డ్ రిజిస్ట్రేషన్ నెంబర్ టీఎస్ 07 2 0 ఎం హెచ్ డి 059 జి ఆర్ 002 నమోదయి ఉన్నదని తెలిపారు. అలాగే మసీదు కరెంట్ బిల్ నెంబర్ 10904–01580 ప్రతి నెల నెల బిల్లు ను చెల్లిస్తున్నాము. ఇటీవల కబరస్తాన్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు మంజూరు అయి ఉన్నాయనీ అన్నారు.మాకు కేటాయించిన భూమిలో లక్ష్మీదేవి







పేట గ్రామానికి చెందిన కొంతమంది ఇటీవల దౌర్జన్యంతో ఆ ఖబరస్థాన్ భూమిలో మట్టిపోసి చదును చేసి చెట్లను పీకి వేసి పైపులు వేసినారని తెలిపారు. కోర్టు ఆర్డర్లో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని నోటీసులు ఇచ్చినారు . హైకోర్టు వారు డబ్ల్యూ డి ఎన్ ఓ 6581 ఓ ఎఫ్ 2026 ద్వారా స్టేటస్కో ఆర్డర్ ఇచ్చినారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా మన్నారు. మా ముస్లింల కబ రస్తాన్ ,మసీదులను, మాకు దానం ఇచ్చినటువంటి 0. 20 గుంటల భూమిని మాకు అప్పగించాలని ,ముస్లిం కులస్తుల మనోభావాలను కాపాడాలని ,మా అందరికీ రక్షణ కల్పించాలని, వారిపై చట్ట రిత్య చర్యలు తీసుకోవాలని, లేనియెడల ముస్లింల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని,మదీనా మజీద్ వ్యవస్థాపక అధ్యక్షులు మహమ్మద్ సర్వర్ అహ్మద్ లు తెలిపారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు పూర్తి చేయాలి.

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**




**ములుగు జిల్లా ప్రతినిధి మే 25 (పీపుల్స్ న్యూస్):** జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాదు నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించే ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్రమాలు) అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పది రోజుల్లోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటివరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయనంతగా ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాక వారికి రూ.45 వేల కోట్లకు పైగా డబ్బులు చెల్లించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం కావడమే కాక నేల సారవంతత కోల్పోతుందని దీనిపై అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్- గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్య ప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదన్నారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఎం సివిల్ సప్లయ్ కృష్ణవేణి, డి డబ్ల్యూ ఓ ప్రేమ లత, సి పి ఓ ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసింది.

**-- అభివృద్ధి మాటలు చెప్పే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు....**
**డబుల్ బెడ్‌రూమ్ హామీలతో ప్రజలను మభ్యపెట్టారని విమర్శ..**
**-- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్**




**బాలానగర్ మే 26 ( పీపుల్స్ న్యూస్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలను పదేళ్ల పాటు మోసం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ విమర్శించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో కూకట్‌పల్లి ప్రజలకు నిలకడైన సంక్షేమం అందించలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో కూడా ప్రజలను నిరాశపరిచారని ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో లక్షా 35 వేల దరఖాస్తులు వచ్చినప్పటికీ, వందల సంఖ్యలో మాత్రమే ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఖైతలాపూర్‌లో నిర్మించిన 148 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వకుండా రాజకీయ అనుచరులకు కేటాయించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అదేవిధంగా దళిత బంధు పేరుతో దళితుల ఓట్లు తీసుకుని, తరువాత వారిని పూర్తిగా విస్మరించారని మదన్ మోహన్ విమర్శించారు. అందుకే కూకట్‌పల్లి ప్రజలు ఎమ్మెల్యే కృష్ణారావును "దళిత ద్రోహి"గా గుర్తుంచుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. మూసీ నది కూకట్‌పల్లి నుంచి ప్రారంభం అవుతుందనే వ్యాఖ్యలు, బతుకమ్మ చీరలను గీత కార్మికులు తయారు చేశారనే వ్యాఖ్యలు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయని అన్నారు. వేదికపై ఉన్న కేటీఆర్ కూడా అలాంటి వ్యాఖ్యలను ప్రశ్నించకుండా చప్పట్లు కొట్టడం విచారకరమన్నారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అవమానించేలా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ మహిళలు ఆ వ్యాఖ్యలను ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విక్రయించిందని, ఎన్నికల ముందు ఓఆర్ఆర్ టోల్ హక్కులను అమ్మి రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని వినియోగించుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదింటిని ఇప్పటికే అమలు చేసిందని మదన్ మోహన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, వాటిలో 50 వేల ఇళ్లలో ఇప్పటికే గృహప్రవేశాలు జరిగాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇందిరమ్మ ఇళు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల గౌరవం, దళితుల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన కోసం కట్టుబడి పనిచేస్తోందని మదన్ మోహన్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అబద్ధపు ప్రచారాలను తిరస్కరించే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

# పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం రక్షణ కవచం

**పోష్ చట్టంపై అందరికీ తప్పనిసరిగా అవగాహన కల్పించాలి**
**మహిళలను వేధిస్తే కఠిన చర్యలు**
**మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యం**
**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**









**ములుగు జిల్లా ప్రతినిధి మే 25 (పీపుల్స్ న్యూస్):** పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం ఒక రక్షణ కవచంలా ఉంటుందని, పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం--2013పై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, మహిళలను వేధిస్తే చట్టం ప్రకారం కఠిన శిక్షలు విధించబడతాయని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో భాగంగా "మహిళల భద్రత -- రక్షణ" కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టంపై జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పని ప్రదేశాల్లో మహిళలు గౌరవంగా, భయభ్రాంతులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని అన్నారు. పోష్ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కార్యాలయంలో 10 మందికి పైగా ఉద్యోగులు ఉంటే అంతర్గత ఫిర్యాదుల కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై నిర్దేశిత గడువులోపు చర్యలు తీసుకునేలా చూస్తామని అన్నారు. పోష్ చట్టంపై ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. మహిళా ఉద్యోగుల భద్రతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. షీ-టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మాట్లాడుతూ, జిల్లాలో మే 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఘనంగా మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోష్ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. "బాల్య వివాహం -- బతుకు ఆగం" అనే నినాదంతో బాల్యవివాహాల రహిత ములుగు జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పోష్ చట్టం, న్యూట్రిషన్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి. హెచ్. మహేందర్ జీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి ఆవిష్కరించారు. అంతకముందు చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సహించడం కొరకు, చట్టబద్ధమైన దత్తతపై అవగాహన పెంచుట కొరకు దత్తత సహాయక కేంద్రంను ప్రారంభించి, మహిళా భద్రత పై సంతకాల సేకరణను జిల్లా కలెక్టర్ ప్రారంభించారుఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, జిల్లా అధికారులు, సీడీపీఓలు, మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాల ద్వారా ఐదుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది**
**అర్హులకు పారదర్శకంగా కారుణ్య నియామకాలు**
**ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యం**
**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**







**ములుగు జిల్లా ప్రతినిధి మే 25( పీపుల్స్ న్యూస్):** ఉద్యోగంలో ఉన్న సమయంలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కారుణ్య నియామకాల విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన ఐదుగురికి ములుగు జిల్లా పరిధిలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ నియామకాలతో సంబంధిత కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం లభించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ఏ. వెంకటలక్ష్మిని వెంకటాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో, పి. భానును ములుగు మండల పరిషత్ కార్యాలయంలో, డి. హరీష్‌ను ఏటూరు నాగారం మండల పరిషత్ కార్యాలయంలో, పి. వంశీకృష్ణను వాజేడు మండల పరిషత్ కార్యాలయంలో, పి. సునీతను తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, జిల్లా అధికారులు, సీడీపీఓలు, మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు సామాజిక దురాచారాలు వివాహాలను సంపూర్ణంగా రూపుమాపుదాం

**గాంధీనగర్ గ్రామ సర్పంచ్**
**బానోత్,నిర్మల వెంకన్న**






**ములుగు జిల్లా ప్రతినిధి మే 25 ( పీపుల్స్ న్యూస్):** గోవిందరావుపేట మండలంలోని కోటగడ్డ గాంధీనగర్ గ్రామలో ప్రత్యేక గ్రామసభ గాంధీనగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న అధ్యక్షతన బాల్య వివాహ రహిత గ్రామం లక్ష్యంతో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం మహిళలు, పిల్లలు దివ్యాంగుల సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ ప్రత్యేక గ్రామసభల ప్రధాన ఉద్దేశ్యం బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య ప్రోత్సాహం గ్రామ స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థను బలోపేతం చేయడం. గ్రామాన్ని " బాల్య వివాహ రహిత గ్రామం"గా ప్రకటించేందుకు అవసరమైన ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించబడింది. సభలో పాల్గొన్న అధికారులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించి, ప్రతి వివాహానికి వయస్సు ధృవీకరణ తప్పనిసరి అని సూచించారు. అలాగే గ్రామంలో బాల్య వివాహాలను అడ్డుకునే చర్యలు, స్కూల్ డ్రాప్ అవుట్ బాలికల పునఃప్రవేశం, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై దృష్టి సారించారు. గ్రామ ప్రజలు బాల్య వివాహాలు జరగనివ్వమని సంకల్పం వ్యక్తం చేసి, గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ గ్రామసభలో గాంధీ నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రఘు, ఉప సర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, భూక్య మంజుల, కూరాకుల సురేష్, లిక్కి కుమారస్వామి, తేజావత్ హుని, గాంధీనగర్ గ్రామం ప్రజలు , ఐ సి డి ఎస్ ఇన్చార్జి సీడీపీఓ విజయ , జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి సోషల్ వర్కర్ శ్రీమతి జ్యోతి , అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం సిబ్బంది గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రద్ధల నడుమ ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి 36వ వార్షికోత్సవం

**-- భరత్ నగర్ కాలనీలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక వాతావరణం**



**బాలానగర్ మే 26 ( పీపుల్స్ న్యూస్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ సాయి అయ్యప్ప ఆలయంలో సోమవారం ఉదయం శ్రీ అయ్యప్ప స్వామివారి 36వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, మహా అభిషేకాలు నిర్వహించి స్వామివారిని అలంకరించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి, ధార్మిక కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న సేవలను సభ్యులు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు వాసిరెడ్డి కృపాకర్, పండుగ సత్తయ్య, రామకృష్ణ ప్రసాద్, రాధాకృష్ణన్, రాము, అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రముఖులు మరియు భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

హైదరాబాద్
పీపుల్స్ న్యూస్
దినపత్రిక
మంగళవారం, మే 26, 2026



# తప్పిపోయిన 85 ఏళ్ల వృద్ధుడి గుర్తింపు.. కుటుంబ సభ్యులకు అప్పగింత

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 25 (పీపుల్స్ న్యూస్) :** రెండు రోజుల క్రితం చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా తిరుగుతూ కనిపించిన 85 ఏళ్ల వృద్ధుడు షేక్ ఇస్మాయిల్‌ను చిలకలగూడ పోలీసులు సురక్షితంగా రక్షించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానవత్వంతో స్పందించి వృద్ధుడిని కుటుంబంతో చేర్చిన పోలీసుల చొరవను పలువురు అభినందించారు. వివరాల ప్రకారం.... అంబర్‌పేట ఖాద్రీ బాగ్ కు చెందిన షేక్ ఇస్మాయిల్ (85) ఈ నెల 22న సాయంత్రం నమాజ్ కోసమని ఇంటి నుండి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కాగా, రెండు రోజుల క్రితం ఆయన చిలకలగూడ పరిసర ప్రాంతాల్లో దిక్కుతోచని స్థితిలో ఒంటరిగా తిరుగుతుండగా చిలకలగూడ పోలీసులు గమనించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రారంభంలో ఆయన తన చిరునామా వివరాలను సరిగ్గా చెప్పలేకపోయారు. అయితే, పోలీసులు ఆయన్ని ఆత్మీయంగా విచారించగా తాను మౌలాలీ ప్రాంతంలో ఉంటానని, తన కుమారుడు ఆటో డ్రైవర్ అని తెలిపారు. దీనిపై పోలీసులు పత్రికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూనే మరోవైపు వృద్ధుడిని గుర్తింపు కోసం



ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చిలకలగూడ డివిజన్ సహాయ పోలీస్ కమిషనర్ కె. శశాంక్ రెడ్డి, చిలకలగూడ ఎస్హెచ్ఓ వి. రామకృష్ణ ల సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో, సబ్-ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, హోంగార్డ్ ఆఫీసర్ పిచ్చయ్యలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారు వృద్ధుడిని నేరుగా మౌలాలీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ స్థానిక ఆటో డ్రైవర్లకు చూపించగా వారు వృద్ధుడిని గుర్తించి, వెంటనే ఆయన కుమారులైన షేక్ సలీం (మెటీరియల్ సప్లయర్), షేక్ కలీం (ఆటో డ్రైవర్)లకు సమాచారం అందించారు. మరోవైపు, తండ్రి కనిపించకుండా పోవడంతో చిన్న కుమారుడు కలీం అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. అదే సమయంలో తన తండ్రి చిలకలగూడ పోలీసుల సంరక్షణలో సురక్షితంగా ఉన్నారనే సమాచారం అందడంతో, ఆయన అంబర్‌పేట పోలీసులకు సమాచారమిచ్చి మిస్సింగ్ కేసు ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. అనంతరం కుమారులు చిలకలగూడ పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా, వృద్ధుడు షేక్ ఇస్మాయిల్‌ను పోలీసులు వారికి సురక్షితంగా అప్పగించారు. వృద్ధుడిని శ్రమకోర్చి వెతికి, క్షేమంగా అప్పగించడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ చంద్రయ్య, హోంగార్డ్ పిచ్చయ్యలను అధికారులను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

# ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి

### ట్రాఫిక్ త్రిముల్గెర్రీ డివిజన్, మల్కాజిగిరి ఏసీపీ జి. శంకర్ రాజు

**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 25 (పీపుల్స్ న్యూస్) :** రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ త్రిముల్గెర్రీ డివిజన్, మల్కాజిగిరి ఏసీపీ జి. శంకర్ రాజు అన్నారు. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ఆదేశాలు , అదనపు డీసీపీ, ట్రాఫిక్-1 సూచనల మేరకు, ట్రాఫిక్ త్రిముల్గెర్రీ డివిజన్ పరిధిలో సోమవారం అనధికార వాహన లైట్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనధికారికంగా అమర్చిన, అధిక ప్రకాశం కలిగిన , డాజ్లింగ్ వాహన లైట్ల వినియోగాన్ని నియంత్రించడం. ఇటువంటి లైట్లు రాత్రి సమయంలో ఇతర వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగించడమే కాకుండా, తాత్కాలికంగా చూపు మందగింపుకు కారణమై రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది. ఈ డ్రైవ్ సందర్భంగా బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 239 కేసులు, త్రిముల్గెర్రీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 233 కేసులు, అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 242 కేసులు, మొత్తం 714 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అనధికార




వాహన లైట్ల వినియోగాన్ని నివారించాలని కోరారు. ఇటువంటి ఉల్లంఘనలు ఇతర రోడ్డు వినియోగదారుల ప్రాణ భద్రతకు ముప్పుగా మారి ప్రమాదాలకు కారణమవుతాయని తెలిపారు. ప్రజల భద్రత ,సాఫీ ట్రాఫిక్ నిర్వహణ కోసం మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లను నిరంతరం కొనసాగిస్తారు.




# విధి నిర్వహణలో మరింత సమర్థతను చాటాలి

### పోలీస్ అధికారులను ఆదేశించిన డిజీపీ సీ.వి .ఆనంద్.

**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో మే 25 (పీపుల్స్ న్యూస్) :** విధి నిర్వహణలో మరింత సమర్థతను చాటాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన విస్తృత తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆయన స్వయంగా పరిశీలించారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో డిజిపి అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలోని అన్ని విభాగాలు అత్యంత పరిశుభ్రంగా ఉండాలని, ఆఫీస్ రూపురేఖలు మార్చేలా గోడలు, అల్మారాలు, టేబుళ్లకు ఒకే విధమైన (స్టాండర్డైజ్డ్) రంగులు వేయించాలని సూచించారు. కార్యాలయంలో ఎక్కడపడితే అక్కడ ఫైళ్లను ఉంచకుండా, తక్షణమే వాటిని రికార్డు రూమ్‌కు తరలించాలని స్పష్టం చేశారు. అలాగే కాన్ఫరెన్స్ హాల్, ట్రైనింగ్ హాల్ సహా ఇతర గదులను మరింత విశాలంగా మార్చేందుకు వీలుగా రీ-డిజైనింగ్ (పునర్నిర్మాణం) చేయాలని అధికారులతో చర్చించారు. ఈ తనిఖీల్లో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ ఎమ్. భగవత్, డీజీ (ఆర్గనైజేషన్ ఽ హోంగార్డ్స్) స్వాతి లక్రా, డీజీ (టెక్నికల్









సర్వీసెస్) వి.వి. శ్రీనివాసరావు, డీజీ (సీఐడీ) చారు సిన్హా, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, గజరావు భూపాల్ , పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని తమ తమ విభాగాల పనితీరు, ప్రస్తుతం కొనసాగుతున్న కార్యకలాపాలను డీజీపీ సీవీ ఆనంద్‌కు వివరించారు.

# ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పల్పునూరి తులసిరెడ్డి కి ఘన సన్మానం





**కుత్బుల్లాపూర్,మే 25 (పీపుల్స్ న్యూస్) :** ప్రపంచంలోనే ఎత్తయిన మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డి ని భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ గ్రామానికి చెందిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డి స్వగ్రామమైన భౌరంపేట్‌కు తిరిగి వచ్చిన ఆయనను గ్రామ ప్రజలు, నాయకులు , కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు .అనంతరం భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి, ప్రాంతానికి తులసిరెడ్డి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిద్దెల యాదిరెడ్డి, పల్పునూరి పద్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి (చింటు), పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, పల్పునూరి బల్వంత్ రెడ్డి, గుర్రాల శ్రీకాంత్ రెడ్డి ,కుటుంబ సభ్యులు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి

### -- శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**బాలానగర్ మే 26 ( పీపుల్స్ న్యూస్):** కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట్‌లో కొలువైన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్‌తో పాటు సభ్యులు కవలి పండు, ఎం. రమేష్, పేరుమండ్ల నర్సింగ్ రావు, నోముల బాబురావు, మెట్టు వినోద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దేవాలయాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శ్రీ నల్ల పోచమ్మ తల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నూతన పాలక మండలి సభ్యులు భక్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అన్ని విధాలుగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, శేఖర్ గౌడ్, తూము సంతోష్ పటేల్, సునీల్ యాదవ్, గాజుల మహేష్ గౌడ్, సప్పిడి భాస్కర్, సత్యనారాయణ, గజానంద్ శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాలానగర్‌లో ఘోర ప్రమాదం: మ్యాన్‌హోల్‌లో దిగి దినసరి కూలి మృతి!

### -- బాలానగర్ సీఐ టి. నరసింహారాజు



**బాలానగర్ మే 26 ( పీపుల్స్ న్యూస్):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పారిశ్రామికవాడలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డ్రైనేజీ క్లీనింగ్ కోసం మ్యాన్‌హోల్‌లోకి దిగిన ఓ దినసరి కార్మికుడు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. బాలానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫతేనగర్‌కు చెందిన వల్లపు నరసింహ (43) అనే వ్యక్తి బాలానగర్ లేబర్ అడ్డాలో దినసరి కూలీగా పనిచేస్తుంటాడు. అయితే, నిబంధనల ప్రకారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది మినహా ఇతరులు ఎవరూ డ్రైనేజీలు క్లీన్ చేయడానికి వీల్లేదు. కానీ,'వీర్ కెమి ఆగ్రోమాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు చెందిన కాంట్రాక్టర్ బలవంతం చేయడంతో, నరసింహ ఎలాంటి రక్షణ కవచాలు లేకుండా మ్యాన్‌హోల్‌లోకి దిగాడు. లోపల ఉన్న విష వాయువులు, ఊబి కారణంగా నరసింహ క్షణాల్లో స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఊపిరాడక నరసింహ అక్కడికక్కడే మృతి చెందాడు.?సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్, కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమకు అండగా ఉండాల్సిన వ్యక్తి దూరమయ్యాడంటూ నరసింహ భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# ఐదుగురు మహిళా చిన్న తరహా వ్యాపారులపై పెట్టీ కేసులు నమోదు



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 25 (పీపుల్స్ న్యూస్):** చార్మినార్ , మక్కా మసీదులను సందర్శించే పర్యాటకుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన నడక దారి పై ఆటంకం కలిగిస్తూ వ్యాపారం చేస్తున్న ఐదుగురు మహిళా చిన్న తరహా వ్యాపారులపై చార్మినార్ పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని గుల్జార్ హౌజ్ నుండి చార్మినార్ ,మక్కా మసీదు వైపు వెళ్లే ప్రధాన రహదారి పర్యాటకుల నడక కోసం ఉద్దేశించబడింది. అయితే, రాజస్థాన్ రాష్ట్రం అల్వార్ ప్రాంతానికి చెందిన అంజు సింగ్ (19), సబీ దేవి (38),మనూ దేవి (43),మనీషా (20), శకుంతల (36)లు ప్రస్తుతం మీర్‌పేట్ పరిధిలోని నందనవనం (టి.కె.ఆర్. కమాన్ సమీపంలో) నివసిస్తూ, ఈ ప్రధాన రహదారిపై కృత్రిమ పూల వ్యాపారం సాగిస్తున్నారు. పర్యాటకుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నందున, ఇక్కడి నుండి దుకాణాలను తొలగించుకోవాలని పోలీసులు పలుమార్లు చేసిన విజ్ఞప్తులను హెచ్చరికలను వారు ఖాతరు చేయలేదు. దీంతో ఈ నెల 23న చార్మినార్ పోలీసులు సదరు మహిళలపై పెట్టీ కేసులు నమోదు చేశారు. కోర్టు తీర్పు కేసు నమోదు చేసిన అనంతరం, నిందితులైన ఐదుగురు మహిళలను సోమవారం 1వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితులకు తలా రూ. 200/- జరిమానా విధించడంతో పాటు, సాయంత్రం 5:00 గంటల వరకు చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో సామాజిక సేవ చేయాలని తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా చార్మినార్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాట్లాడుతూ చార్మినార్ పరిసర ప్రాంతాలలో పర్యాటకులకు, పాదచారులకు ఇబ్బంది కలిగించేలా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రభుత్వం పౌరుల జేబులను నిశ్శబ్దంగా దోచుకుంటోంది- ద్రవ్యోల్బణ మనిషి మోదీ



**న్యూ ఢిల్లీ :** ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ మండిపడింది. ఈ రోజువారీ దోపిడీ వల్ల ఎవరు లబ్ధి పొందు తున్నారని ప్రశ్నించింది. సామాన్య ప్రజల పొదు పును తగలబెట్టడానికి, మోదీ ప్రభుత్వం పెట్రో ల్ చల్లిందని విమర్శించింది. గత 10 రోజుల్లో ఇంధన ధరలను పెంచడం ఇది నాలుగోసారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశాన్ని దోచుకోవడం వల్ల రైతులు, చిన్న పరిశ్రమలు, సమాజంలోని ప్రతి వర్గం నష్టపోతున్నారని ఆరోపించింది. 'ద్రవ్యోల్బణ మనిషి మోదీ': రాహుల్ప్రభుత్వం పౌరుల జేబులను "నిశ్శబ్దంగా దోచుకుంటోంది" కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఎన్నికల సమయంలో ఇంధన ధరలను అదుపులో ఉంచినప్పటికీ, ఇప్పుడు వాటిని విడతల వారీగా పెంచుతున్నారని, ఇకపై అవి మరింత పెరుగుతూనే ఉంటాయని ఆయన ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'ద్రవ్యోల్బణ మనిషి మోదీ' అని అభివర్ణిస్తూ, రానున్న 'ఆర్థిక తుపాను' గురించి తాను గతంలోనే హెచ్చరించానని, అయితే ఆ సమయంలో ప్రధానమంత్రి ఎన్నికల ప్రచారంపైనే దృష్టి సారించారని ఆయన ఆరోపించారు. ఇంధన దోపిడీ ఇంకా ముగియ లేదుఇంధన దోపిడీ రోజువారీ దాడి ఇంకా ముగియలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్లో పోస్ట్ చేశారు. 2004, 2014 మధ్య యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ చమురు ధరలు 175.34 శాతం పెరిగాయని ఖర్గే వెల్లడించారు. అదే మోదీ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ చమురు ధరలు, ఒక్క సెంట్ కూడా పెరగలేదన్నారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం 2014లో లీటరుకు 71.41 రూపాయలుగా ఉన్న పెట్రోల్ ధరను 2026 నాటికి 102.12 రూపాయలకు పెంచిందన్నారు. అలా మొత్తంగా 43.01 శాతం పెంచిందన్నారు. 67.87 శాతానికి పెరుగుదలడీజిల్ ధరలను లీటరుకు 56.71 నుంచి 95.20 రూపాయలకు పెంచిందని ఖర్గే విమర్శించారు. ఇది 67.87 శాతం పెరుగుదల అని ఖర్గే చెప్పారు. మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో ప్రజల నుంచి 43 లక్షల కోట్లను లూటీ చేసిందని అయన దుయ్యబట్టారు. అంటే రోజూ 1,000 కోట్ల రూపాయల చొప్పున దోపిడీ చేసిందని ఆరోపించారు. ప్రజల కంటే లాభాల ఉందని విమర్శించారు. ప్రతి ఇంధన ధరల పెంపు గృహ బడ్జెట్పై మరో దెబ్బ లాంటిదని పేర్కొన్నారు. ఇది ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ వల్ల నష్టపోతోందని ఖర్గే పేర్కొన్నారు.

## బహిరంగ నమాజ్, జంతుబలి నిషేధం.. సీఎం యోగి కీలక ఆదేశాలు



**లఖ్నవూ :** దేశవ్యాప్తంగా బక్రీద్(ఈద్ అల్ అధా) వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్ప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రం లో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశా ల్లో నమాజ్ల నిర్వహణ, జంతుబలిని అనుమ తించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లఖ్న వూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదు లు, ఈద్గాహ్ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి సర్కార్ నిర్ణయించిం ది. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువుల ను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిం చింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాం ఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.

## అస్సాం అసెంబ్లీలో ఉమ్మడి పౌరస్మృతి బిల్లు



**గౌహతి:** ఉమ్మడి పౌరస్మృతి బిల్లుఅస్సాం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. బహుభార్యత్వాన్ని నిషేధించాలని, లివిన్ రిలేషన్లను రిజిస్టర్ చేయాలని, పెళ్లి.. విడాకులు, వారసత్వం అంశాల్లో ఒకేరకమైన విధానాన్ని పాటించాలన్న ఉద్దేశంతో కేంద్ర సర్కారు యూసీసీ బిల్లును తీసుకువస్తున్నది. అయితే ఇటీవల ప్రభుత్వ ఏర్పాటు తర్వాత హిమంత బిశ్వ శర్మ సర్కారు తొలి క్యాబినెట్ భేటీలో ఆ బిల్లకు క్లియరెన్స్ ఇచ్చింది. అయితే అస్సాంలో జీవిస్తున్న షెడ్యూల్ తెగల ప్రజలు ఈ బిల్లు వర్తించదు. సీఎం హిమంత బిశ్వ శర్మ తరపున మంత్రి అతుల్ బోరా ఈ బిల్లును ప్రవేశపెట్టారు. యూసీసీ బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్రాల్లో అస్సాం మూడవ రాష్ట్రంగా నిలిచింది. ఇటీవల ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలు కూడా ఈ బిల్లును ప్రవేశపెట్టాయి. పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం లాంటి చట్టాలను సరళతరం చేయాలని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆ న్యాయం పరిధిలోకి రావాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు తెలుస్తోంది. యూసీసీ ప్రకారం పురుషులు పెళ్లి చేసుకోవాలంటే కనీసం 21 ఏళ్లు ఉండాల్సిందే, మహిళలకు ఆ ఏజ్ను 18గా ఫిక్స్ చేశారు. హక్కుల లభించే ఉద్దేశంతో పెళ్లిళ్లు, విడాకుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయనున్నారు

## నీట్-యూజీ 2026 పేపర్ లీక్ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ



**న్యూ ఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గతంలో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ ఆరాధే నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో కూడా ఇదే అంశం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిందని, అప్పట్లో కోర్టు సూచనల మేరకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేసింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు అమలయ్యాయా లేదా అన్న విషయంపై ఎన్టీఏ పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. గురువారం లోపు ఆ నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "ఇది బాధాకరం. గత ఘటనల నుంచి వారు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు. ఈ అంశం ఇప్పటికే కోర్టు ముందుకు వచ్చింది. అప్పట్లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పలు సూచనలు చేసింది. ఇప్పుడు ఆ సూచనల అమలుపై స్పష్టత కావాలి" అని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. నీట్ పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని పిటిషనర్లు వాదించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఏను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని లేదా దాని స్థానంలో స్వతంత్ర, పారదర్శక సంస్థను ఏర్పాటు చేయాలని కోర్టును కోరారు. ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో వ్యక్తమయ్యాయి. ఈ పరీక్షను ఎన్టీఏ నిర్వహించింది. అయితే లీక్ ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో మే 12న పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కోర్టులో కీలక వాదనలు వినిపించారు. ఇప్పటికే 22 లక్షలకుపైగా విద్యార్థులు ఈ వ్యవస్థపై నమ్మకం కోల్పోయా రని పేర్కొన్నారు.

వరుసగా జరుగు తున్న లీక్ ఘటనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులపై నేరుగా దాడి చేసినట్లేనని వాదిం చారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఇంకా, మళ్లీ నిర్వహించే పరీక్షలను ఒక హైపవర్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించాలని పిటిషనర్లు కోరారు. ఆ కమిటీలో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఛైర్మన్గా నియమించాలని, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలను సభ్యులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరగకుండా అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు అదేవిధంగా, గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వం వహించిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. ఆ కమిటీ సూచనల అమలు పై కూడా వివరాలు ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. "కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు పరిస్థితిని తెలియజేస్తూ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్గా కె. రాధాకృష్ణన్ నివేదిక సమర్పించాలి" అని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రత అంశాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశాల కోసం ఈ పరీక్ష రాస్తుంటారు. ఇలాంటి కీలక పరీక్షల్లో వరుసగా లీక్ ఆరోపణలు రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది. ఇప్పటికే ఈ అంశంపై రాజకీయ విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు, పరీక్షా విధానాన్ని పూర్తిగా డిజిటల్, సురక్షిత పద్ధతిలోకి మార్చాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో గురువారం మళ్లీ విచారణ జరగనుంది. అప్పటికి ఎన్టీఏ సమర్పించే అఫిడవిట్, కేంద్ర ప్రభుత్వం స్పందనపై సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# విజయ్ ప్రభుత్వం రెండేళ్లకు మించి ఉండదు.. అలా చేయమంటూ ఉదయనిధికి స్టాలిన్ సలహా



**చెన్నై:** జోసెఫ్ విజయ్ నాయకత్వంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ మనుగడపై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. టీవీకే సర్కారు రెండేళ్లు కూడా కొనసాగదని స్టాలిన్ జోస్యం చెప్పారు. జరిగిన డీఎంకే యువజన విభాగం నిర్వాహకుల సమావేశంలో స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా యువజన విభాగం సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. సొంతంగా కంటెంట్ క్రియేట్ చేసేలా యూత్ వింగ్క వర్క్షాపులను నిర్వహించాలని ఉదయనిధి స్టాలిన్కు డీఎంకే అధినేత సలహా ఇచ్చారు. సినీ గ్లామర్ వల్లే టీవీకే టీవీకే గెలిచిందని, ఇది రాజకీయ చైతన్యం ఏ మాత్రం కాదని అన్నారు. ఈ ఆకర్షణ తాత్కాలికమేనని, ఈ సర్కారు రెండేళ్లు కూడా కొనసాగదని వ్యాఖ్యానించారు. తల్లిని పిల్లలు వెతికినట్టు జనం కొద్దిరోజుల్లో డీఎంకేను వెతుక్కుంటూ వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి కొద్ది రోజుల ముందు కూడా విజయ్ ప్రభుత్వం ఎక్కువ రోజులు అధికారంలో ఉండరని, మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీఎంకే కార్యకర్తలకు పిలుపునిచ్చిఎక్కువ రోజులు అధికారంలో ఉండరని, న సంగతి తెలిసిందే. డీఎంకే యూత్ విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ దాటకుండా తమ కూటమిలోని పార్టీల దయాదాక్షిణ్యాలతోనే టీవీకే అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. తమ మిత్రపక్షాలు కొన్ని స్టాలిన్ అనుమతితో విజయ్కు మద్దతు ఇస్తే.. రెండు దశాబ్దాలు తమతో కలిసున్న కాంగ్రెస్ మాత్రం వెన్నుపోటు పొడిచిందని ఉదయనిధి విమర్శించారు. దేశంలో బీజేపీ గెలవడానికి మోదీ, అమిత్షా కారణమని ఇన్నాళ్లు భావించామని, నిజానికి కాంగ్రెస్సే కారణమనే విషయం ఇప్పుడు తెలిసిందని దుయ్యబట్టారు. తమిళనాడులో డీఎంకే వల్లే కాంగ్రెస్కు ఐదు ఎంపీ సీట్లు వచ్చాయని, ఇప్పుడేమో పదవుల కోసం చెప్పా పెట్టకుండా కూటమి నుంచి వెళ్లిపోయిందని ఆరోపించారు. కనీస కృతజ్ఞత, నాగరికత లేని కాంగ్రెస్ పార్టీని ఇకపై నమ్మబోమని, వారికి ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని తమిళనాడు ప్రతిపక్ష నేత మండిపడ్డారు.

## సుప్రీంకోర్టులో నేషనల్ హైవేస్ అథారిటీకి గట్టి ఎదురుదెబ్బ!




**న్యూఢిల్లీ, మే 25:** భూ వివాదంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా×)కు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. భూములు కోల్పోయిన యజమానులు పెంచిన నష్ట పరిహారాన్ని విత్డ్రా చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ఆర్డర్పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ససేమిరా అంది. యాదాద్రి - వరంగల్ నేషనల్ హైవే భూసేకరణ వివాదంలో భూ యజమానులకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో హైకోర్టు ఆదేశాలు యథాతథంగా సుప్రీంకోర్టు ఉంచినట్లు అయింది. దాంతో రైతులకు భారీ ఉపశమనం కలిగినట్లు అయింది. అలాగే అధికారులు పెంచిన నష్టపరిహార మొత్తాన్ని విత్డ్రా చేసుకోవచ్చని రైతులకు వెల్లడించింది. నగదు విత్డ్రా చేసుకుంటే తర్వాత రికవరీ కష్టమన్న ఎన్హెచ్ఏఐ వాదనను ఈ కేసు విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. కేవలం ఆర్థిక భారాన్ని సాకుగా చూపి భూ బాధితులకు అందాల్సిన న్యాయమైన పరిహారాన్ని ఆపలేరని స్పష్టం చేసింది. కోర్టు విధించిన షరతులకు లోబడి పెరిగిన పరిహారం మొత్తాన్ని తెలంగాణ విత్డ్రా చేసుకోనున్నారు.

## ఇరాన్పై అమెరికా మళ్లీ దాడి చేస్తుందా



**అమెరికా:** ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ విషయంలో ఒక స్పష్టత రావడం లేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ సంచలనంగా మారింది. బాంబును మోసుకెళుతున్న ఒక యుద్ధ విమానం ఫొటోను షేర్ చేశారు ట్రంప్. ఆ ఫొటోపై 'థాంక్యూ ఫర్ యువర్ అటెన్షన్ టు దిస్ మ్యాటర్' అని రాసి ఉంది. యుద్ధ విమానం, ఒక మిస్సైల్ ఫొటో షేర్ చేశాడంటే మళ్లీ ఇరాన్పై దాడికి అమెరికా సిద్ధమవుతోం దా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క ఇరాన్తో అమెరికా చర్చలు కీలక దశలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఇరు దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ డిమాండ్లను అమెరికా అంగీకరించిందని, అమెరికా డిమాండ్లకు కూడా ఇరాన్ తలొగ్గిందని సమాచారం. దీంతో రెండు దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇలాంటి తరుణంలో ట్రంప్ చేసిన పోస్ట్ ఆసక్తికరంగా మారింది. అంతకుముందు కూడా ట్రంప్ తన సోషల్ మీడియా ట్రూత్ ద్వారా ఇరాన్తో చర్చల అంశంపై స్పందించారు. ఇరాన్తో చర్చలు, ఒప్పందం విషయంలో తామేమీ తొందరపడటం లేదన్నాడు.

## బీజేడీ రాజ్యసభ ఎంపీ సమంతరాయ్ రాజీనామా, బీజేపీలో చేరే ఛాన్స్



**భువనేశ్వర్:** నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ (దీజీణ)కు మరో గట్టిదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ దేబాశిష్ సమంతరాయ్ సోమవారంనాడు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను నవీన్ పట్నాయక్కు పంపారు. పార్టీలో తనకు తగినంత గుర్తింపు లేకపోవడం, తన సేవలు పార్టీకి అంతగా అవసరం లేకపోవడంతో రాజీనామా చేస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. నవీన్ పట్నాయక్కు అత్యంత సన్నిహితుడుగా సమంతరాయ్కి పేరుంది. రాజీనామా అనంతరం సమంతరాయ్ మాట్లాడుతూ, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్కు ఈరోజు ఉదయమే లేఖ రాశానని చెప్పారు. ఆ వెంటనే రాజ్యసభ వైస్ ఛైర్మన్ను కలిసి రాజ్యస సభ్యత్వానికి రాజీనామా లేఖను అందజేసినట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో అవిభక్త కటక్ జిల్లాకు, ఒడిశాకు సేవలందించేందుకు రాజ్యస భకు తనను నామినేట్ చేసిన నవీన్ పట్నాయక్కు కృతజ్ఞతలు తెలిపారు. సమంతరా య్ కంటే ముందు జేడీయూ రాజ్యసభ ఎంపీలు సుజీత్ కుమార్, మమతా మహంతలు ఇటీవల రాజీనామా చేశారు. అనంతరం బీజేపీ టిక్కెట్టుపై ఇద్దరూ రాజ్యసభకు ఎన్నికయ్యారు. తాజాగా సమంతరాయ్ రాజీనామాతో రాజ్యసభలో బీజేపీ బలం ఐదుగురు సభ్యులకు తగ్గిపోయింది. కాగా, సమంతరాయ్ బీజేపీలో చేరే అవకాశాలున్నాయని, ఆయన చేరగానే పార్టీ మద్దతుతో తిరిగి రాజ్యసభకు ఎన్నికవుతారని తెలుస్తోంది. కాగా, సమంతరాయ్ రాజీనామాపై బీజేపీ ఎంపీ రబీంద్ర నారాయణ్ బెహరా మాట్లాడుతూ, ప్రస్తుతం ఒడిశాలో బీజేడీ ఒక్కో వికెట్ కోల్పోతోందని అన్నారు. బీజేడీ హయాంలో సుపరిపాలని అందించలేదని, పార్టీలో అందరూ ఉక్కిరిబిక్కిరవుతున్న పరిస్థితి ఉందని చెప్పారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోందని అన్నారు. సమంతరాయ్ బీజేపీలో చేరవచ్చని అనుకుంటున్నామని, ఆయన పార్టీలో చేరితో ఆయనకు సంబంధించి పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాము స్వాగతిస్తామని చెప్పారు.

# కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పురా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్దకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం.

నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్–జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి




రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా.

సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్దాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్దాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలప డుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది.

అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

## నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు

**- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు**

**న్యూఢిల్లీ,మే25:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై



నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

**అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**

**న్యూఢిల్లీ,మే25:** అమెరికా–ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక్



భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. ‡ారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.

## కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే







**కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు**

**తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే**

**న్యూఢిల్లీ,మే25:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.


## 'రాజీ' పడలేకే రాజీనామా!

తెలంగాణా విద్యా కమిషన్ చైర్మన్,మాజీ ఐఏయస్ అధికారి ఆకునూరి మురళి రెండు రోజుల కిందట రాజీనామా చేశారు. లేఖను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఇచ్చిన బాధ్యతను పూర్తిచేశానని చెబుతూ, అందుకే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన పదవి మరో మూడు నెలలు ఉంది. ఈ లోపే రాజీనామా చేయడం విద్యావేత్తల్లో చర్చకు దారితీసింది. రాజీనామా వెనుక లోతైన కారణాలు ఉన్నాయని భావిస్తోంది. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యా సంస్కరణలో భాగంగా ఆకునూరి మురళీ చైర్మన్‌గా మరికొందరి విద్యావేత్తలతో తెలంగాణా విద్యాకమిషన్ ఏర్పాటు చేసింది.యుద్ధ ప్రాతిపదికన విద్యాకమిషన్ పాఠశాలలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, విద్యా విషయాలు, పలువురు విద్యారంగం ప్రముఖులతో చర్చించింది. ఇతరదేశాల విద్యా వ్యవస్థలను పరిశీలన చేసి తనదైన శైలిలో ప్రభుత్వ పాఠశాలలో పరిస్థితిని వివరిస్తూ గత ఏడాది బడ్జెట్‌కు ముందే 355పేజీల కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి తయారు చేసింది.ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో బడ్జెట్‌కు కొద్దిరోజుల ముందు



ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బట్టివిక్రమార్కకు నివేదిక అందజేసింది. ప్రభుత్వపాఠశాల నమోదు క్షిణత, సంస్కరణ రూపాన్ని ఛైర్మన్ ఆ నివేదికలో ఆవిష్కరణ చేశారు. తెలంగాణా ఫౌండేషన్, పబ్లిక్ స్కూల్స్ రెండురకాల పాఠశాలల ఏర్పాటును ప్రతిపాదించారు. మండలానికి 50కోట్ల రూపాయల చొప్పున ఏడాదికి వంద మండలాలకు ఐదువేల కోట్ల బడ్జెట్‌తో ఆరు విద్యా సంవత్సరాల్లో రూ.31,500కోట్లతో తెలంగాణా పాఠశాల విద్యా సంస్కరణ పూర్తి అవుతుందనే సిఫార్సుతో నివేదిక అందించారు.అయితే గతేడాది బడ్జెట్ కు ముందే ఆయన సంస్కరణ సిఫార్సులు చేసినప్పటికీ తెలంగాణా పబ్లిక్ స్కూల్స్‌కు బడ్జెట్‌లో ఒక్కపైసా కేటాయించలేదు. సరికదా! రంగారెడ్డి జిల్లాలో ఆరుట్ల అనబడే ఓ మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు జరిపాలని ప్రభుత్వం కోరింది. గత సంవత్సరం ఆకునూరి మురళీ బృందం ఆ పని విజయవంతంగా పూర్తిచేసింది.అయితే అదే ఏడాది తెలంగాణా పబ్లిక్ స్కూల్స్ ను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మానసపుత్రిక అయిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు 58కి శంకుస్థాపన చేశారు. గతేడాది ఆ యంగ్ ఇండియా స్కూళ్ళు రూ. 15,500కోట్లు ఖర్చు చేసినట్లు కూడా ఆయన ప్రకటించారు.


# రోళ్లు పగిలే ఎండల వెనుక ఉన్న జ్యోతిష రహస్యం- రోహిణి కార్తె విశిష్టత ఇదే!



తెలుగు పంచాంగం ప్రకారం ఒక ఏడాదిలో 27 కార్తెలు ఉంటాయి. పూర్వకాలంలో రైతులు ఈ కార్తెల ఆధారంగానే వర్షాలు అంచనా వేసి పంటలు పండించే వారు. వాతావరణంలో మార్పులు కూడా కార్తెలకు అనుగుణంగానే జరుగుతాయి. పూర్వం మన పెద్దలు కూడా ఏ కార్తెలు ఎలా ఉంటుందో ఠక్కున చెప్పేసే వారు. ఈ క్రమంలో వేసవి కాలంలో వచ్చే రోహిణి కార్తెలో రోళ్లు సైతం పగిలేంత ఎండలు ఉంటాయని వారు ఆ రోజుల్లోనే విశ్లేషించి చెప్పేవారు. మే 25, సోమవారం నుంచి రోహిణి కార్తె ప్రవేశిస్తున్న సందర్భంగా అసలు కార్తెలు ఎలా ఏర్పడతాయి? రోహిణి కార్తె విశిష్టత ఏమిటి? కార్తెలకు వాతావరణ మార్పులకు ఉన్న సంబంధం ఏమిటి? అనే ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం.

కార్తె అంటే ఏమిటి కార్తెలు ఎలా ఏర్పడతాయి?
భారతీయ జ్యోతిషశాస్త్రం, వ్యవసాయ ఆధారిత పంచాంగం ప్రకారం సూర్యుడు ఒక నిర్దిష్ట నక్షత్రంలో సంచరించే కాలాన్ని కార్తె అంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మనకు మొత్తం 27 నక్షత్రాలు ఉన్నాయి. సూర్యుడు ఒక్కో నక్షత్రంలో ప్రవేశించి ఆ నక్షత్రంలోనే సుమారు 13 నుంచి 14 రోజుల పాటు ఉంటాడు. ఈ 14 రోజుల కాలాన్ని ఒక కార్తెగా పేర్కొంటారు. సూర్యుడు ఏ నక్షత్రంలోకి ప్రవేశిస్తే ఆ నక్షత్రం పేరుతో కార్తె ఏర్పడుతుంది. ఈ ప్రకారంగా చూస్తేఏడాదిలో మొత్తం 27 కార్తెలు ఉంటాయి.
కార్తెలకు అనుగుణంగా వాతావరణ మార్పులు ఉంటాయా?పూర్వం మన పెద్దలకు శాస్త్రీయ జ్ఞానం అంతగా లేకపోయినా వారి అనుభవంతోనే వాతావరణాన్ని అంచనా వేసి ఈ సమయంలో ఇలా ఉంటుందని కచ్చితంగా చెప్పగలిగే వారు. నేటి ఆధునిక యుగంలో భూతాపం పెరగడం వల్ల వాతావరణంలో కొన్ని అసహజ మార్పులు ఉన్నప్పటికీ ఎక్కువ భాగం వాతావరణం మార్పులు కార్తెలను అనుసరించే ఉండటాన్ని గమనించవచ్చు. ఉదాహరణకు రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయని, వర్షాకాలంలో వచ్చే జ్యేష్ఠ కార్తె జడిపిస్తుందని, మూల కార్తె ముంచెత్తుతుందని ఇలా ఆయా కార్తెల్లో ఏర్పడే వాతావరణ మార్పులను అనుసరించి ఈ సామెతలు పుట్టాయి. ఈ సందర్భంగా అసలు రోహిణి కార్తె విశిష్టత ఏమిటి? ఆ సమయంలో వాతావరణంలో వచ్చే మార్పుల గురించి తెలుసుకుందాం.రోహిణి తెలుగు పంచాంగం ప్రకారం సూర్యుడు రోహిణి నక్షత్రంలో ప్రవేశించడంతో మొదలయ్యే రోహిణి కార్తె తిరిగి సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించే వరకు దాదాపు 15 రోజుల పాటు కొనసాగుతుంది. రోహిణి కార్తె అనేది హిందూ జ్యోతిష, వ్యవసాయ పంచాంగాల ప్రకారం ఎండలు అత్యంత తీవ్రంగా ఉండే సమయం. ఈ సమయంలో రోళ్లు పగిలేంత ఎండలు, వడగాలులు, ఉక్కపోత ఎక్కువగా ఉంటాయి.
ఈ ఏడాది రోహిణి కార్తె ఎప్పటి నుంచి?
ఈ ఏడాది మే 25 సోమవారం నుంచి రోహిణి కార్తె ప్రారంభమై, తిరిగి జూన్ 7, ఆదివారం వరకు కొనసాగుతుంది. జూన్ 8, సోమవారం నుంచి మృగశిర కార్తె ప్రారంభం అవుతుంది.
రోహిణి కార్తెలో ఎండలు ఎక్కువ ఎందుకు?
రోహిణి కార్తెలో భూమిపై సూర్యకిరణాలు నిటారుగా పడటం వల్ల ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగుతాయి. సకల జీవరాశి ఈ తీవ్రమైన వేడిమికి అల్లాడిపోతుంది. వ్యవసాయ రీత్యా వర్షాకాలానికి ముందు నేలను సిద్ధం చేయడానికి, కొన్ని ప్రత్యేక రకాల వరి నార్లు పోయడానికి ఈ కార్తెను వ్యవసాయంలో ముఖ్యమైన కాలంగా భావిస్తారు.
పురాణ విశ్వాసాలువిష్ణు పురాణంలో కూడా రోహిణి కార్తె తీవ్రత గురించిన ప్రస్తావన ఉంది. రోహిణి కార్తె ఎండల తీవ్రతను తట్టుకోవడం సామాన్యం కాదని, ఈ కష్టాన్ని భరించడం వల్ల పూర్వ జన్మ పాపాలు హరించి, దైవానుగ్రహాన్ని పొందవచ్చునని పురాణ వచనం.
భయపెట్టే రోహిణి కార్తె ఎండలు
రోహిణి కార్తెలో సూర్యభగవానుడు భగ భగ మండిపోతూ ఉంటాడు. నాలుగు నెలలుగా వచ్చే వేడి గాలులు ఒక ఎత్తు అయితే, కేవలం రోహిణి కార్తె సమయంలో మాత్రం నేరుగా రోళ్లు పగిలేంత ఎండలు పెరిగిపోతాయి. ఈ పక్షం రోజుల్లో సూర్యుని తీవ్రత తీవ్ర స్థాయికి చేరుకుని, మృగశిర కార్తె నుంచి కొద్ది కొద్దిగా క్రమంగా తగ్గుతుంది.రోహిణి కార్తెలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?ఎండ తీవ్రత అధికంగా ఉండే రోహిణి కార్తెలో వీలైనంత వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నీడ పట్టున ఉండటం మంచిది. ఈ పదిహేను రోజుల పాటు ప్రతిరోజూ సూర్యోదయం సమయంలో సూర్యునికి అర్ఘ్యం సమర్పించి ఆదిత్య హృదయం పారాయణ చేయడం, సూర్య నమస్కారాలు చేయడం వల్ల సూర్యుని అనుగ్రహాన్ని పొందవచ్చు.
ఆరోగ్య ప్రదాతప్రతిరోజూ "ఓం సూర్యాయ నమః" అనే మంత్రాన్ని జపించడం వల్ల ఎండ వల్ల కలిగే అనారోగ్య సమస్యల నుంచి రక్షణ లభిస్తుంది.ఈ దానాలు శ్రేష్ఠం
సూర్య తాపం అధికంగా ఉండే రోహిణి కార్తెలో నీటితో నిండిన కుండను దానం చేయడం, చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు పంపిణీ చేయడం అత్యంత పుణ్యప్రదమని శాస్త్రం చెబుతోంది. అలాగే మామిడి పండ్లు, పాదరక్షలు, గొడుగులు దానం చేయడం కూడా మంచిది.గ్రహ దోషాలు తొలగించే శ్రీకృష్ణుని పూజశ్రీకృష్ణుని జన్మ నక్షత్రం రోహిణి నక్షత్రం కాబట్టి సూర్యుడు రోహిణి కార్తెలో సంచరించే రోహిణి కార్తె సమయంలో ప్రతిరోజూ బాల

# బహుభాషా నైపుణ్యంతో మెదడుకు మేలు - అందుకే పిల్లలకు ఎక్కువ భాషలు నేర్పించాలట!



అప్పుడప్పుడే మాటలు నేర్చుకొంటున్న చిన్నారులు స్కూల్లో చేరే వరకు కుటుంబ సభ్యుల మధ్యే ఉంటారు. దీంతో పేరెంట్స్, ఇంట్లో వాళ్లు ఏ భాష మాట్లాడితే దాన్నే అనుకరిస్తుంటారు. స్కూల్?కు వెళ్లడం మొదలు పెట్టిన తర్వాత హిందీ, ఇంగ్లీషు వంటి భాషలు సైతం తమ సిలబస్‌లో భాగంగా నేర్చుకొంటారు. ఈ క్రమంలో కొందరు తాము నేర్చుకొన్న భాషల్లో రాయడం, చదవడం వరకు మాత్రమే పరిమితం అవుతారు. ఇంకొందరు వాటిలో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాల్ని సంపాదించగలుగుతారు. ఇలా బహుళభాషాలు మాట్లాడగలిగే చిన్నారుల్లో, మెదడు చాలా చురుగ్గా పనిచేయడంతో పాటు జ్ఞాపకశక్తీ పెరుగుతుందంటున్నారు నిపుణులు. మరి, ఎక్కువ భాషలు నేర్చుకోవడం వల్ల చిన్నారులకు కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకు మల్టీటాస్కింగ్! : ఈ తరం చిన్నారులు ఎంతో చురుగ్గా ఉంటున్నారు. చిన్నవయసులోనే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకొంటున్నారు. ఓ వైపు చదువుకొంటూనే, మరో వైపు తమకు నచ్చిన వ్యాపకాల్లో రాణిస్తున్నారు. అయితే, సాధారణ చిన్నారులతో పోలిస్తే, ఎక్కువ భాషలు నేర్చుకొన్న పిల్లలు మరింత చురుగ్గా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మనం ఏ భాషలో ప్రశ్న సంధిస్తే తిరిగి అదే భాషలో సమాధానమివ్వగల సామర్థ్యం వారికి ఉంటుందట. ఒకే సమయంలో వేర్వేరు భాషల్లో మాట్లాడినప్పటికీ దానికి తగిన విధంగా వారు మారిపోగలరని పేర్కొంటున్నారు. దీన్నే ఇంగ్లిష్‌లో 'జగ్లింగ్ స్కిల్స్' (జీబస్త్రస్త్రశ్రీఅఅస్త్ర ంఎఅశ్రీశ్రీం) అని పిలుస్తారు. ఇలాంటి వారికి మల్టీ టాస్కింగ్ స్కిల్స్ ఎక్కువగా ఉంటాయట. అంతే కాదు, చిన్నారుల దృష్టిని మరల్చాలని ఇతరులు ప్రయత్నం చేసినప్పటికీ అది సఫలం కాదట. ఇలాంటి పిల్లలు భవిష్యత్తులో మల్టీ మారతారని తెలియజేస్తున్నారు. అంతేకాదు, వెంట వెంటనే విభిన్నమైన పనులు చేయడంలోనూ నేర్పరులుగా రాణిస్తారని వివరిస్తున్నారు. ఎక్కువ భాషలు నేర్చుకొన్న చిన్నారుల్లో ఒకే సమయంలో రెండు పనుల్ని చేయగలిగే సామర్థ్యం పెరుగుతుందని పలు అధ్యయనాల్లో తేలింది.మెదడు చురుగ్గా : భాషలు పనిచేయడానికి సంబంధం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎలాగంటే, ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకొన్నప్పుడు వాటికి సంబంధించిన పదజాలమంతా బ్రెయిన్?లో నిక్షిప్తమై ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుందట. అంతేకాదు, ఏ భాషనైతే మాట్లాడు తున్నామో, దానికి సంబంధించిన పదజాలాన్ని మాత్రమే ఎంచుకొనేలా మెదడు వేగంగా స్పందిస్తుందని అంటున్నారు. ఇలా మెదడుకు చురుకుదనం అలవాటవుతుందట. దీనికి సంబంధించి నిర్వహించిన వివిధ పోటీల్లో ఒకే భాషపై పట్టున్న వారి కంటే రెండు కంటే ఎక్కువ భాషలు మాట్లాడగలిగే వారు చాలా చురుగ్గా ఉన్నట్లు కొన్ని పరిశోధనల్లో గుర్తించాత్రణ : పిల్లలకు సంతోషమొచ్చినా, కోపమొచ్చినా వారిని నియంత్రించడం కష్టం. కానీ, ఒకటి కంటే ఎక్కువ భాషలు తెలిసిన చిన్నారులు మాత్రం తమ భావోద్వేగాలను తామే నియంత్రించుకునే అవకాశం ఎక్కువగా ఎలాగంటే, ఎక్కువ భాషలు తెలిసిన పిల్లలు ఒక భాషలో మాట్లాడుతున్నప్పుడు దానికి సంబంధించిన పదాలను మాత్రమే చెందిన పదాలు రాకుండా జాగ్రత్త పడతారు. ఈ క్రమంలో ఎలాగైతే ఇతర భాషా పదాలు రాకుండా తమని తాము నియంత్రించుకొంటారో, అలాగే భావోద్వేగాల విషయంలోనూ ప్రవర్తిస్తారని పలు అధ్యయనాల్లో తేలింది. అలాగే వీరిలో ఏకాగ్రత కూడా ఎక్కువగా ఉంటుందట. ఎలాంటి కష్టమైన పనైనా సరే పూర్తి దృష్టి దాని పైనే పెట్టగలరట. అంతేకాదు, తాము అనుకొన్న దాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో ఉండడం బహు భాషా ప్రావీణ్యం ఉన్న చిన్నారుల నైజం. పైగా తాము చేసే పని వినూత్నంగా ఉండాలనీ అనుకుంటారట.

# వ్యాధులు నశింపజేసే కర్కటేశ్వర ఆలయం విశిష్టత- ఒక్కసారి ఈ క్షేత్రాన్ని దర్శిస్తే ఆయురారోగ్యాలు మీ సొంతం!



తమిళనాడులోని కుంభకోణం ఆలయాల నగరంగా విరాజిల్లుతోంది. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా 2000 ఆలయాలు ఒక్క కుంభకోణంలోనే వెలసి ఉన్నాయంటే ఈ నగరం ఎంత విశిష్టమైనదో తెలుస్తోంది. సాధారణంగా శివాలయం లేని ఊరు ఉండదంటారు. కానీ కుంభకోణంలో ప్రతి వీధిలో ఒక శివాలయం దర్శనమివ్వడం విశేషం. అలాంటి కుంభకోణంలో వెలసిన అతి ప్రాచీనమైన ఒక శివాలయం గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**వ్యాధులు నశింపజేసే కర్కటేశ్వరుడు**
ఆలయాల క్షేత్రంగా విరాజిల్లుతున్న కుంభకోణంకు సమీపంలో పవిత్ర కావేరి నదీతీరంలో పచ్చటి పంట పొలాల మధ్యలో తిరుందుదేవన్గుడి ఆలయంలో పరమేశ్వరుడు కర్కటేశ్వరుడిగా వెలసి భక్తుల పాలిట ఆరోగ్య ప్రదాతగా విరాజిల్లుతున్నాడు. నందు కోవిల్?గా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో శివునికి అభిషేకం చేసిన నువ్వుల నూనెను ప్రసాదంగా ఇస్తారు. ఈ నూనెను సేవిస్తే దీర్ఘకాలిక రోగాలు సైతం నయమవుతాయని విశ్వాసం. ఇంతటి మహిమాన్వితమైన ఈ క్షేత్ర స్థల పురాణం గురించి తెలుసుకుందాం.

**స్థల పురాణం**
పూర్వం దుర్వాస మహర్షి శివ పూజ చేస్తుండగా చూసిన ఓ గంధర్వుడు మహర్షిని చూసి 'మీ నడక పీత నడకలా ఉందని' వేళాకోళం చేశాడు. దానితో అసలే కోపిష్టి అయిన దుర్వాస మహర్షి 'పీతగానే పడి ఉండమని' శపించాడు. దాంతో గంధర్వుడు పశ్చాత్తాపం చెంది మహర్షిని శరణువేడి శాపోపశమనం చెప్పమని ప్రార్థించాడు. అప్పుడు దుర్వాస మహర్షి గంధర్వునితో 'దీక్షగా శివుని ఆరాధిస్తే పీత రూపం తొలగుతుందని' శాపోపశమనం గురించి చెప్పాడు. ఆనాటి నుంచి గంధర్వుడు పీత రూపంలో శివుణ్ణి ఆరాధించసాగాడు.

**ఇంద్రుని శివ పూజ**
ఒకసారి దేవేంద్రుడు 1008 కమలాలతో శివుని పూజించాలని సంకల్పిస్తాడు. ఆ విధంగా ఇంద్రుడు ప్రతిరోజూ 1008 కమలాలతో శివుని పూజించసాగాడు. ఒకరోజు ఇంద్రుడు తెచ్చిన 1008 కమలాల్లో ఒకటి తగ్గుతుంది. ఇలా ఎందుకు జరిగిందని ఇంద్రుడు ఆశ్చర్యపోయి పరిసరాలు గమనించగా పీత ఒక కమలాన్ని శివునికి సమర్పించడాన్ని చూశాడు. అంతే ఇంద్రుడు తన ఆయుధంతో ఆగ్రహంతో పీతపై దాడి చేయబోగా, అది వెళ్లి శివలింగంపై ఉన్న రంధ్రంలో దాక్కుంది. దాంతో ఇంద్రుని ం శివలింగానికి బలంగా తగిలి గాటు పడుతుంది.

**శివుని క్షమాపణ కోరిన ఇంద్రుడు**
తన ఆయుధంతో శివలింగానికి దెబ్బ తగలడంతో ఇంద్రుడు విచారించి శివుని క్షమించమని ప్రార్థిస్తాడు. అంతట భక్తవత్సలుడైన శివుడు ప్రత్యక్షమై దేవేంద్రుడిని అనుగ్రహించడంతో పాటు శివలింగంలో దాగిఉన్న పీతకు కూడా పూర్వపు గంధర్వ రూపాన్ని అనుగ్రహిస్తాడు. పీత అంటే కర్కటానికి శాపవిమోచనం కలిగించాడు కాబట్టి ఇక్కడ శివుడు కర్కటేశ్వరుడుగా పూజలం దుకుంటున్నాడు. ఆనాడు శివలింగంపై ఏర్పడిన గాటు, పీత దాక్కున్న శివలింగంపై రంధ్రాన్ని ఈనాటికీ దర్శించవచ్చు.

**చోళరాజును కరుణించిన కర్కటేశ్వరుడు**
ఒకానొక సమయంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన చోళరాజు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతుండేవాడు. రాజ వైద్యులు ఎంత ప్రయత్నించినా రాజు వ్యాధి నయం కాలేదు. అప్పుడు చోళరాజు పరమేశ్వరునికి మొరపెట్టుకోగా శివపార్వతులు మానవ రూపంలో వచ్చి రాజుకు మహిమగల విభూతిని అనుగ్రహిస్తారు. ఆ విభూతి ధరించిన వెంటనే రాజు పరిపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడు. రాజు ఆరోగ్యవంతుడు అయిన తక్షణమే శివపార్వతులు అదృశ్యమవుతారు. తరువాత రాజు వారి కోసం ఎంత వెతికించినా దొరకలేదు. వారి జాడ కోసం ఆవేదనతో చింతిస్తున్న చోళరాజుకు 'నీ భక్తికి మెచ్చి నీ జబ్బును నయం చేసాం. పీత నన్ను పూజించిన చోట శివాలయాన్ని నిర్మించు! నన్ను నమ్మి కొలిచిన భక్తుల రోగాలను హరించి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాను' అనే శివ వాణి వినిపించింది.


**తిరుందుదేవన్గుడి ఆలయం ఇలా ఏర్పడింది?**
ఈ విధంగా వినిపించిన శివవాణిని విన్న చోళరాజు సంతోషంతో శివుడు చెప్పినట్లే పీత శివుని పూజించిన చోట గొప్ప శివాలయాన్ని నిర్మించాడు. ఆ క్షేత్రమే తిరుందుదేవన్గుడి ఆలయం. ఈ క్షేత్రాన్ని దర్శించి అక్కడ ప్రసాదంగా లభించే శివుని అభిషేకించిన నువ్వుల నూనెను స్వీకరిస్తే చికిత్సకు లొంగని మొండి వ్యాధులు సైతం నయమవుతాయని విశ్వాసం. పీత పూజించిన క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రంలో శివుణ్ణి కర్కటేశ్వరుడు అంటారు.ఎలా చేరుకోవాలి?
తిరుందుదేవన్గుడి ఆలయం ఇలా ఏర్పడింది?
ఈ విధంగా వినిపించిన శివవాణిని విన్న చోళరాజు సంతోషంతో శివుడు చెప్పినట్లే పీత శివుని పూజించిన చోట గొప్ప శివాలయాన్ని నిర్మించాడు. ఆ క్షేత్రమే తిరుందుదేవన్గుడి ఆలయం. ఈ క్షేత్రాన్ని దర్శించి అక్కడ ప్రసాదంగా లభించే శివుని అభిషేకించిన నువ్వుల నూనెను స్వీకరిస్తే చికిత్సకు లొంగని మొండి వ్యాధులు సైతం నయమవుతాయని విశ్వాసం. పీత పూజించిన క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రంలో శివుణ్ణి కర్కటేశ్వరుడు అంటారు.

**ఆలయ విశేషాలు**
గర్భాలయంలో శివుడు కర్కటేశ్వరుడిగా పూజలందుకుంటుండగా అమ్మవారు ఇక్కడ అపూర్వ నాయకి అమ్మన్ గా కొలువై ఉన్నారు.

**ఈ రాశి వారికి దోషాలు తొలగించే క్షేత్రం**
పునర్వసు, పుష్యమి, ఆశ్లేష నక్షత్రాల్లో జన్మించిన కర్కాటక రాశి వారికి ఈ క్షేత్రం ఆరోగ్యప్రదాయినిగా, పాప పరిహార క్షేత్రంగా భాసిల్లుతోంది.తమిళనాడులోని కుంభకోణం నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ తిరుందుదేవన్గుడి ఆలయానికి చేరుకోవడానికి దేశం నలుమూలల నుంచి రైలు, బస్సు సౌకర్యాలున్నాయి. ఒక్క కర్కాటక రాశి వారిని మాత్రమే కాదు అనారోగ్యంతో ఈ క్షేత్రానికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతోనే తిరిగి వెళ్తారని ఆలయ అర్చకులు చెబుతారు. ఇంతటి మహిమాన్విత క్షేత్రాన్ని మనం కూడా దర్శించి ఆయురారోగ్యాలు పొందుదాం.
ఓం నమః శివాయ!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ఈ మొక్కలతో ఇల్లు చల్లగా ఉంటుందట - మీరూ ఇలా ట్రై చేసి చూడండి!

ఇప్పుడు బయట ఎండ మండిపోతోంది. ఇంట్లోనూ ఉక్కపోత తప్పట్లేదు. దీన్ని నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలను తెగ వాడేస్తున్నాం. అలా వాడటం అనేక ఆరోగ్య సమస్యలకు కారణం కావొచ్చుంటున్నారు నిపుణులు. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే కొన్ని రకాల మొక్కల్ని పెంచుకుంటే గాలి శుద్ధి, ఆహ్లాదకర వాతావరణంతో పాటు చల్లగా కూడా ఉంటుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఎలాంటి పెంచుకుంటే మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం!కలబంద : ఎండా కాలంలో ఇంట్లో కలబంద మొక్కల పెంపకం ప్రయోజనకరంగా ఉంటుంది. కేశ సంరక్షణకు, చర్మ సౌందర్యానికి ఉపయోగపడే కలబంద. గది ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించడంలోనూ ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.వెదురు పామ్ : ఈ మొక్కలు కాంతి తక్కువ ఉన్న పరిస్థితుల్లోనూ పెరుగుతాయి. కాలుష్యాన్ని తొలగించి గాలి తాజాగా, చల్లగా ఉండేలా చేస్తాయి.మీ ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారా? - మీరు ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!బేబీ రబ్బర్ : ఇంట్లో పెంచుకునే అందమైన మొక్కల్లో బేబీ రబ్బర్ ఒకటి. ఈ మొక్కలు గాలిలో టాక్సిన్లు తొలగించి, నాణ్యతను మెరుగుపరిచి వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయి. చిన్నగా ఉంటుంది. కాబట్టి, దీన్ని ఇంట్లో ఎక్కడైనా సులభంగా పెంచుకోవచ్చు. రోజూ నీరు పోయాల్సిన అవసరం లేదు. 2010లో టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం, బేబీ రబ్బరు మొక్కలు



కార్బన్?డయాక్సైడ్ స్థాయిలను తగ్గించడంలో, ఇంట్లో గాలి నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.ఇంట్లో ఉండే పచ్చని మొక్కలను చూడడం వల్ల కంటికి ప్రశాంతత కలిగి మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఈ మొక్కల్ని వారంలో నాలుగు రోజులు ఇంట్లో, రెండు రోజులు ఆరు బయట పెడితే ఎక్కువ కాలం ఉంటాయి. - ఎం. శ్రీధర్, ఉద్యాన శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్
ఫైకస్ : దీన్ని చిన్నపాటి కుండీ లేదా తొట్టెలో ఇంట్లోనే పెంచుకోవచ్చు. ఈ మొక్క గాలిని శుద్ధి చేస్తుంది. ఫార్మాల్డి హైడ్, బెంజీన్, ట్రైక్లోరో ఎథిలీన్ వంటి గాలిలోని కాలుష్యాలను తొలగించడంతో పాటు వేడిని తగ్గించడంలో సాయపడుతుంది.లెమన్?గ్రాస్ : ఆక్సిజన్?తో పాటు యాంటీ ఆక్సిడెంట్లకు గొప్పగా పని చేస్తాయి. ఇవి గాలిని శుద్ధిచేసి పరిసరాలు తాజాగా ఉండేందుకు తోడ్పడతాయి.
ఫెర్న్ : ఎండాకాలంలో ఇంటిని చల్లగా ఉంచగల మొక్క ఇది. నిండా ఆకులతో కనువిందు చేసే ఫెర్న్ గాలిలో తేమను నిలిపే గుణం కలిగి ఉంటుంది. గాలిలోని కార్బన్?డయాక్సైడ్?ను గ్రహించి ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది. ఇంట్లో గాలి నాణ్యతను వ ా ం ంగ ా వ ం చ డ ం లో న ా సహాయపడుతుంది.స్నేక్ ప్లాంట్ : ఈ మొక్కలు ఫార్మాల్డిహైడ్, బెంజీన్ వంటి టాక్సిన్లను తొలగించడంతో ఇంట్లో గాలి శుభ్రపడుతుంది. ఇది రాత్రిపూట ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది.స్పైడర్ ప్లాంట్ : గాలిలో ఉండే కార్బన్?డయాక్సైడ్, ఫార్మాల్డి హైడ్?లను తొలగించడంలో స్పైడర్ ప్లాంట్?లు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇవి గాలిలో తేమను జోడించి ఇల్లంతా చల్లగా ఉండేలా చేస్తాయట.తులసి : తులసి ఇంట్లోని కార్బన్?డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను గ్రహించి గాలిని శుద్ధి చేస్తుంది. ఇది రోజులో సుమారు 20 గంటల వరకు ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పవర్ లిఫ్టింగ్ లో పతకాల పంట
## జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, మే 25 :** హైదరాబాదులోని సనత్ నగర్ లో సబ్ జూనియర్– జూనియర్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 4 బంగారు పతకాలు,1 రజిత పతకం, 2 కాంశ్య పతకాలు, మొత్తం మీద ఏడు పతకాలు సాధించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి తెలిపారు. వీరిలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన మోడెమ్ వంశీకి బంగారు పతకం, డివి శంకర్రావుకు బంగారు పతకం, మహంతి వెంకటకృష్ణాజీకి కాంశ్య పతకం, పాల్వంచకు చెందిన పి రాజేష్ కు బంగారు పతకం, దివాకర్ కు రజిత పతకం, శేషు కు కాంశ్య పతకం, మణుగూరుకు చెందిన తోలెం పార్థు టెండూల్కర్ కు బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారులను, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, క్రీడా సంఘాల నాయకులు, మరియు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు మరియు గ్రీన్ భద్రాద్రి సభ్యులు సిటీ స్టైల్ జిమ్ సభ్యులు తదితరులు అభినందించడం జరిగింది.

## ముత్యాలపాడులో ఉపాధి హామీ పనులను పరిశీలించిన తాటి



**మే 25:ములకలపల్లి :** మండలం ముత్యాలపాడు గ్రామంలో జరుగు తున్న ఉపాధి హామీ పథకం పనులను బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పరిశీలించారు.గ్రామస్తులు, ఉపాధి కూలీలతో మాట్లాడి పనుల తీరును అడిగి తెలుసు కున్నారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పని దినాలు సరిపోతున్నాయా అని ఆరా తీశారు. గ్రామ సమస్యలు, రైతుల ఇబ్బందులపై కూలీలతో చర్చించారు.
"బిఆర్ఎస్ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేశాం అని అన్నారు.

## ఎండలు బాబోయ్... ఎండలు...
### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...మాజీ జెడ్పీటీసి పాల్వంచ దుర్గ



**మణుగూరు మే 25:** పినపాక నియోజకవర్గ ప్రజలు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మాజీ జెడ్పీటిసి పాల్వంచ దుర్గ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమ వుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉదయం నుంచే భగ్గుమనే ఎండలు, వేడి గాలులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తలకు టోపీ, గొడుగు ఉపయో గించడంతో పాటు కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందేందుకు తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచి ంచారు.అస్వస్థతకు గురైన వారు వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలని, చిన్నపిల్లలు, వృ ద్ధులు, బయట పనులు చేసే కార్మికులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పాల్వంచ దుర్గ వి జ్ఞప్తి చేశారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటే వడదెబ్బ వంటి ప్రమాదాలను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.

## ఫుడ్ గ్రేయిన్ స్టోరేజ్ లకు శంకుస్థాపన కార్యక్రమం



**మే 25:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ననుసరించి ఈ రోజు మండలం లో 14 వి ఓ భవనములు, మండల కేంద్రం లో ఫుడ్ గ్రేయిన్ స్టోరేజ్ కు ఆయా జీపీ లలో సర్పంచ్, ఉప సర్పంచ్, డ్వాక్రా మహిళలు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. సీతారాంపురం.... 4వీక్ . రామవరం..... 2కమలాపురం.... 1పూసుగూడెం... 1చప్రాలపల్లి .. 1గుట్ట గూడెం ... 1ముత్యాలంపాడు... 1జగన్నాధపురం.... 1సీతాయిగూడెం... 2ములకలపల్లిలో ఫుడ్ గ్రేయిన్ స్టోరేజ్ నిర్మాణం
ఇట్టి కార్యక్రమం లో ఎంపీడీఓ , తాసిల్దార్ , ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, వి ఓ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## కొమ్ముగూ డెం గ్రామం లో మహిళ సమాఖ్య భవనం శంకుస్థాపన కార్యక్రమం



**దమ్మపేట, మే 25:** గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన శంకుస్థాపన కార్యక్రమం జిల్లా భారస నాయకులు సోయం వీరభద్రంహాజరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నా స్వయం సహాయక బృందాలు, మహిళ సంఘలకు సౌకర్యార్థం (వి.ఓ)భవనంతెలంగాణ రాష్ట్రం లో అధికారం లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 6 హామీలు తో ఎన్నికలు ముంధు (మేనిఫెస్టో)లో మహిళలకు ఇచ్చిన వాక్దానలు అమలు చెసి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్దిని నిరుపించుకోవాలి----సోయం .వీరభద్రం దమ్మపేట (మండలం) కొమ్ముగుడెం (గ్రామం) లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రణాళిక లో భాగంగా కొమ్ముగుడెం సర్పంచ్ సోయం సత్యవతి అధ్యక్షతన వార్డు సభ్యుల ఆధ్వర్యంలో మహిళా గ్రామ సమాఖ్య (వి .ఓ ) నూతనశీగా మంజూరు అయిన భవనం శంకుస్థాపన కార్యక్రమం కి హాజరు అయిన జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం గారు.ఈ సంధర్భంగ వీరభద్రం మట్లాడుతు గ్రామల్లో మహిళలు ఆర్థిక స్వలశీభాన కోసం ఆర్థికశీగా రాణిశీచుటకు,మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ఎర్పాటు చేయటం జరిగినధి అని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నా స్వయం సహాయక బృందలు,మహిళలు వారి అవసరం అయిన సభలు సమావేశాలు నిర్వాహించడానికి సరైన వేదికలు వి.ఓ భవనాలు అని సోయం వీరభద్రం గారు అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి,ఉప సర్పంచ్ బుద్దుల శ్రీను,సోయం కృష్ణవేణి, రవ్వ సుజాత బుద్దుల కృష్ణ ,మెరీ,జోనుబోయిన.సుబ్బారావు,నరసింహారావు, సోయం సత్యనారాయణ,పద్దం.విజయలక్ష్మి మరియు మహిళ సంఘాల సభ్యులు తధితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పై పోరాటమే ధ్యేయంగా సిపిఐ
## అశ్వరావుపేట మండల,పట్టణ కౌన్సిల్ సమావేశం

-అశ్వరావుపేట మునిసిపాలిటీ పరిధిలోని సమస్యలపై పోరాటం చేద్దాం
-అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయాలి
-ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు మానుకోవాలి
కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేద్దాం
-సిపిఐ అశ్వరావుపేట మండల, పట్టణ కౌన్సిల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం




**అశ్వారావుపేట, మే 25:** అశ్వరావుపేట కేంద్రంలోని సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యాలయం అయిన సయ్యద్ మియాజాని భవన్లో అశ్వరావుపేట మండల,పట్టణ కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి వగ్గెల అర్జునరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీం మాట్లాడుతూ శాఖ కార్యదర్శి లు అందరూ సమాయత్తమై 2026 పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని సత్వరమే పూర్తి చేయాలని, అదేవిధంగా అశ్వరావుపేట మండలం, పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై పోరాటం చేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని ఆయన అన్నారు. అశ్వరావుపేట మండలంలో, పట్టణంలో అనర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేస్తున్నారనే వదంతులు వినిపిస్తున్న తరుణంలో అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలతో ముందుకు పోతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేద ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తూ,ఏకతత్వ ధోరణిలో పరిపాలన చేయాలని చూస్తోందని, దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ,సిపిఐ పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్ కాంత్, పట్టణ సహాయ కార్యదర్శి సయ్యద్ జాకీర్,మహిళా సంఘం నాయకులు చీపుర్ల సత్యవతి, రిజ్వానా,రోహిణి, శ్రావణి,మార్తిన సత్యవతి,సిపిఐ నాయకులు చెన్నారావు,వెంకన్న, ప్రసాద్,విజయ్,శ్రీను,మరియు పట్టణ, మండల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు...

## అన్ సీజన్లో పంటలు లేని సమయంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఎపి అమ్మకాలు నిలుపుదల చెయ్యాలి

**– జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ఏలూరు, మే 25:** కైకలూరు మండలం తామ రకొల్లు గ్రామంలో సోమవారం శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న యూరియా డిఎపి, పొటాషియం మరియు కాంప్లెక్స్ ఎరువులు భౌతిక నిల్వలు, ఈపాసు నిల్వలు, అమ్మకాలు వివరాలు, స్టాకు రిజిస్టర్లు, రైతులకు ఇస్తున్న బిల్లులను పరిశీలించి, కొన్ని వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అన్ సీజన్లో పంటలు లేని సమయంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఎపి అమ్మకాలు నిలుపుదల చెయ్యాలని ఆదేశించారు. సదరు షాపులో నిలుపుదల చేసిన వివరాలు కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటకు అనుగుణంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు సరైన సమయంలో అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రిటైల్ డీలర్లు మరియు సహకార సంఘాలు ద్వారా యూరియా, డిఎపి మరియు ఇతర ఎరువులు నిల్వలు ఉంచాలని తెలిపారు. రైతులకు అందాల్సిన ఎరువులు అక్రమంగా వ్యవసాయ యేతర అవసరాలకు వినియోగించడం బ్లాక్ మార్కెటు, అక్రమ నిల్వలు పారిశ్రామిక అవసరాలకు వినియోగించిన అటువంటి డీలర్లపై ఎరువులు చట్టం ప్రకారం కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఎరువులు అందుబాటులో ఉంచుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా, ఇంచార్జి ఏడిఏ కె.శ్రీనివాస కుమార్, మండల వ్యవసాయ అధికారి ఆర్.దివ్య, గ్రామ విఏఏలు, మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## "ప్రభుత్వ బడి చదువుల గుడి"

**శ్రీకాకుళం జిల్లా, న్యూస్:-** ప్రభుత్వ బడి ప్రకృతి ఒడి లాంటిదని, చదువులమ్మ గుడి అని సంతవురిటి పాఠశాలల సముదాయం చైర్మన్ కె.వెంకటరావు అన్నారు. పాలఖండ్యాం గ్రామంలో ప్రధానోపాధ్యాయని ఆర్.ఎల్.కుమారి అధ్యక్షతన జరిగిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య సాధ్యమని, వత్తిడి లేని చదువుల అభ్యసనం లభించునని అన్నారు. పాలఖండ్యాం సాంఘిక శాస్త్రోపాధ్యాయులు కుదమ తిరుమ లరావు మాట్లాడుతూ మండల విద్యాశాఖాధికారులు అరసాడ రవి, ముల్లు శ్రీనివాసరావులు ఎప్పటికప్పుడు నమోదు శాతం మెరుగుదలకు అనునిత్యం తమకు నిర్దేశాలతో కూడిన సూచనలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు సర్కారు బడిలో ఎట్టి ప్రవేశ రుసుము లేదని, ఉచితంగా విద్య, విద్యా సామగ్రి, మధ్యాహ్న భోజనం, క్రీడా సామగ్రి స్వీకరిస్తున్నారని, డెబ్బది రోజుల ప్రణాళికలతో రోజువారీ మూల్యాంకనాలతో విజ్ఞానం పొందగలుగుతున్నారని తిరుమలరావు గుర్తు చేసారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా విద్యా ప్రమాణాలతో కూడిన సామర్థ్యాలను సమకూర్చుచున్నామని, సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై మిక్కిలి కృషి చేస్తున్నామని తెలుపుతూ ప్రభుత్వ విద్యా పథకాలు గూర్చి తిరుమలరావు వివరించారు. పాలఖండ్యాం ఉపాధ్యాయులు ఉప్పలపాటి ఆదిలక్ష్మి, యెందువ వెంకటరమణ, వెలగాడ రాము, ముల్లు సుజాత, ఎం పెంటయ్య, జిఎంఆర్ విఎఫ్ వాలంటీర్ పిల్లల దాలమ్మలు ప్రసంగించారు. సంతవురిటి బీ.సీ.హాస్టల్ వార్డెన్ టి.అప్పారావు, సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ కమలాకరరావు, టి.హరికృష్ణ, బి.సూర్య నారాయణ, పి.రమేష్, వి.దాలినాయుడు, జి.వెంకటరావులు అతిథులుగా విచ్చేసి, స్ఫూర్తిదాయకమైన అంశాలతో ప్రసంగించారు. అత్యుత్తమ విలువలతో కూడిన విద్యను అందిస్తున్న సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఈ పాలఖండ్యాం గ్రామం నుంచి తొమ్మిదో తరగతిలోను మరియు, పదోతరగతిలోను తమ పిల్లలను చేర్పించాలని, గొప్ప ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేలా కృషి చేస్తామని తమ ప్రసంగాల ద్వారా హామీనిచ్చారు.స్థానిక పెద్దలు గౌరవ అతిథులుగా విచ్చేసిన పలిశెట్టి సూర్యనారాయణ, చాంతాటి లక్ష్మి, గర్లంకి శ్రీనివాసరావు, కె.వి.సీతారాం, బత్తుల రామలక్ష్మి, పుల్లెటికుర్తి అమ్ములు, కుప్ప పైడిరాజు, పలిశెట్టి చంద్రమ్మ, అలజంగి అరుణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ యువత, ఎస్.ఎం.సి.సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలతో బడి పిలుస్తోంది నినాదాలతో పెద్ద ఎత్తున ర్యాలీ జరిగింది.



## దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ బియ్యం వెరైటీలు ఇవే.. ఎంతో రుచికరం, ఆరోగ్యకరం..

భారతీయుల ఆహార సంస్కృతిలో బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. బియ్యంతో వండిన అన్నాన్ని చాలా మంది ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. అయితే ప్రస్తుతం ఎక్కువమంది బాస్మతి లేదా పాలిష్ చేసిన తెల్ల బియ్యాన్నే ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. కానీ శతాబ్దాల క్రితమే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేల సంఖ్యలో స్వదేశీ బియ్యం రకాలు సాగు చేయబడేవి. వీటిలో కొన్ని సహజ సువాసనతో, మరికొన్ని ఎరుపు లేదా నలుపు రంగులతో ప్రత్యేకతను సంపాదించాయి. రుచులు, వాసనలు, పోషక విలువలు ఒక్కో రకానికి ఒక్కో విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. వివిధ రాష్ట్రాల్లో పండే స్వదేశీ బియ్యం రకాల గురించి నిపుణులు వివరిస్తున్నారు. అస్సాంలో ప్రసిద్ధి చెందిన జోహా బియ్యం చిన్నగా, గుండ్రంగా ఉండే గింజలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇది ఉడుకుతున్నప్పుడు ఇల్లంతా తీయని పూల వాసనలా పరిమళిస్తుంది. వండిన తర్వాత మెత్తగా ఉండే ఈ బియ్యం అతుక్కుపోకుండా ఉంటుంది. పులావ్, పండుగల భోజనాలు, ఖీర్ వంటి తీపి వంటకాల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అస్సాంలో శతాబ్దాలుగా సాగు చేస్తున్న ఈ బియ్యానికి జీఐ ట్యాగ్ కూడా లభించింది.
పశ్చిమ బెంగాల్, మణిపూర్..పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోబిందోభోగ్ బియ్యం అక్కడి సంప్రదాయాలతో ముడిపడి ఉంది. చిన్న తెల్లని గింజలతో ఉండే ఈ బియ్యం వెన్నలాంటి మృదువైన వాసనను ఇస్తుంది. ఖిచిడి, పాయేష్, పులావ్ వంటి బెంగాలీ వంటకాల్లో దీన్ని ప్రధానంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా దుర్గాపూజ సమయంలో ఈ బియ్యం లేకుండా సంప్రదాయ వంటలు పూర్తి కావని భావిస్తారు. 2017లో ఈ బియ్యానికి జీఐ గుర్తింపు లభించింది. అలాగే మణిపూర్‌కు చెందిన చక్–హావో అనే నల్ల బియ్యం దేశంలో అత్యంత ప్రత్యేకమైన రకాలలో ఒకటి. వండకముందు నల్లగా కనిపించే గింజలు ఉడికిన తర్వాత గాఢ ఊదా రంగులోకి మారుతాయి. కొద్దిగా తీయని, నట్స్ రుచిని కలిగిన ఈ బియ్యం పురాతన



కాలంలో రాజవంశీయులకే పరిమితమై ఉండేదని చెబుతారు. చక్–హావో ఖీర్ ఈ బియ్యంతో చేసే ప్రసిద్ధ వంటకం. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు కూడా దీనిని ఇష్టపడుతున్నారు.తమిళనాడు, ఉత్తర ప్రదేశ్..తమిళనాడులో ప్రసిద్ధి చెందిన మప్పిళ్లై సంబా ఎర్ర బియ్యం వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. వరుడి బియ్యం అని అర్థమయ్యే ఈ రకం శక్తి, స్టామినా పెంచుతుందని నమ్మకం. గట్టిగా ఉండే ఈ బియ్యాన్ని దోశలు, ఇడ్లీలు, గంజి వంటి సంప్రదాయ వంటల్లో ఉపయోగిస్తారు. ఒకప్పుడు కనుమరుగవుతున్న ఈ రకం ఇప్పుడు ఆరోగ్యకరమైన ధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తితో మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాలానమక్ బియ్యానికి బౌద్ధకాలం నాటి చరిత్ర ఉందని చెబుతారు. దీని పేరుకు కారణం గింజలపై ఉండే నలుపు రంగు పొట్టు. ఉడికినప్పుడు పాప్‌కార్న్ వాసనలా ప్రత్యేకమైన పరిమళం వస్తుంది. కొద్దిగా తీపి రుచితో ఉండే ఈ బియ్యం పులావ్ వంటి వంటకాలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. సాగు తగ్గిపోవడంతో అంతరించిపోతున్న ఈ రకానికి ప్రభుత్వం జీఐ ట్యాగ్ ఇచ్చి ప్రోత్సాహం కల్పించింది.కేరళ, మహారాష్ట్ర..కేరళలోని నజావర బియ్యం ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఎర్రని గింజలతో ఉండే ఈ బియ్యం సాధారణ బియ్యంతో పోలిస్తే కొద్దిగా చేదు, మట్టి వాసన కలిగిన రుచిని ఇస్తుంది. ఆరోగ్య ప్రయోజనాల కోసం దీన్ని ఆయుర్వేద గంజి, ప్రత్యేక ఆహారాల్లో ఉపయోగిస్తారు. మధుమేహం, ఎముకల బలహీనత వంటి సమస్యల్లో ఇది ఉపయోగకరమని భావిస్తారు. మహారాష్ట్రకు చెందిన అంబెమోహర్ బియ్యం మామిడి పూల పరిమళాన్ని సూచిస్తుంది. వండినప్పుడు వచ్చే సువాసన మామిడి పూల వాసనను తలపిస్తుంది.

# బతికి చచ్చేటోళ్లు

మానవ బంధాలు కూడా మాయచేస్తాయి
కొన్ని పోయిన తర్వాత కూడా జీవిస్తాయి
మరి కొన్ని బతికి ఉన్నపుడే చనిపోతాయి !

పైసల లెక్కలు అటుఇటు అయినా ఫరవాలేదు
జనుల ముఖ కవలికల్ని మాత్రం సరిగ్గా లెక్కించు..
అవి రేపటి రోజు అతి ప్రమాదకరంగా మారవచ్చు !


మగాడి దుఃఖం ఎన్నిటికీ కనిపించదు..
లోలోన సమస్యల లావా ఉబికినా...
పైకి నిర్మలంగా, ప్రశాంతంగా కనిపిస్తుంది !

ఆస్తుల కాగితాలు పొందిన తర్వాత..
ఎందుకో తెలియదు కష్టాల్లో చేయూతనిచ్చిన..
అందరినీ మరిచిపోవడం పరిపాటైంది !

కాలంతో అడిగా నా నేరం ఏమిటని..
అందరినీ ప్రేమించడమే నువ్వు చేసిన నేరం
కాలం అన్న మాటలకు నేను నివ్వెరపోయా..
జనాలకు ప్రేమలు వద్దు, అవసరాలే ముద్దు !

మధుపాళీ

# బిజెపి ఎస్. టి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా గుగులోతు శ్రీకాంత్ నాయక్...


BHARATIYA JANATA PARTY- TELANGANA
Dr.ShyamprasadMukherjiBhavan, Kattelamandi, HYD-500 001
040-24653535 fax: 040-24653929, email: bjptsonline@gmail.com
D: 26.05.2026

Press Release

S.T. Morcha State Committee

As instructed by Sri N. Ramchander Rao, Ex.MLC, BJP State President, the S.T. Morcha State Office Bearers and State Executive Members are hereby announced.

| # | Designation | Name | District |
|---|---|---|---|
| 1 | Vice President | Dr. Billoji Naiak | Nizamabad |
| 2 | Vice President | Mohan Rathod (Retd. IRS) | Adilabad |
| 3 | Vice President | Bhukya Shyamsunder | Khammam |
| 4 | Vice President | Hanmanthu Naik | Ranga Reddy Urban |
| 5 | Vice President | Bhukya Naresh | Yadadri Bhongir |
| 6 | Vice President | Kudimetha Thirupathi | Komarambhim Asifabad |
| 7 | General Secretary | Banavath Sailal Naik | Nagar Kurnool |
| 8 | General Secretary | Kunja Santhosh Kumar | Bhadradri Kothagudem |
| 9 | Secretary | Bhukya Ravi Naik | Bhadradri Kothagudem |
| 10 | Secretary | Rupavath Mahesh, (OU) | Mahankali Secunderabad |
| 11 | Secretary | Banoth Prabhas Naik | Mahabubabad |
| 12 | Secretary | Anusha Naik Banoth | Suryapet |
| 13 | Secretary | Munavath Pandu | Ranga Reddy Rural |
| 14 | Secretary | Guguloth Srikanth | Karimnagar |
| 15 | Treasurer | C.S. Madhusudhan | Hyderabad Central |
| 16 | Media Convenor | Ganesh Modi | Nagar Kurnool |
| 17 | Media Co-Convenor | Banoth Jyothi | Hyderabad Central |
| 18 | Social Media Convenor | Jarpulavath Vishal Naik | Bhagyanagar Malakpet |
| 19 | Social Media Co- Convenor | Kethavath Surender | Mahabubnagar |
| 20 | IT Convenor | Vaibhav Islavath | Nagar Kurnool |
| 21 | IT Co-Convenor | Shiva Naik | Mahabubnagar |
| 22 | Office Secretary | Barmavath Ramesh | Hyderabad Central |
| 23 | Office Jt.Secretary | Padithya Naik | Medchal Urban |
| 24 | Tour & Monitoring Convenor | Tambala Ravi | Bhadradri Kothagudem |
| 25 | Tour & Monitoring Co-Convenor | Bhuvaneswari | Ranga Reddy Urban |



**కరీంనగర్ :** భారతీయ జనతా పార్టీ ఎస్ టి మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా గుగులోతు శ్రీకాంత్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. ఈసందర్భంగా శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తిరిగి రెండోసారి బాధ్యతలు అప్పగించడానికి సహకరించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, రాష్ట్ర , జిల్లా కమిటీ నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎస్టి మోర్చా బలోపేతానికి , బిజెపి విధానాలను , కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పథకాలను గిరిజన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడానికి డానికి శాయ శక్తుల కృషి చేస్తానని శ్రీకాంత్ నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.

# ముత్తంగి శ్రీ పోచమ్మ దేవాలయం చైర్పర్సన్ గా గడ్డ పుణ్యవతి





**పటాన్ చెరు ఎ:**పటాన్ చెరు మండలం ముత్తంగి డివిజన్ లోని నూతన శ్రీ పోచమ్మ దేవాలయం కమిటీని నియమించారు. పోచమ్మ ఆలయం కమిటీ చైర్ పర్సన్ గా గడ్డ పుణ్యవతి నీ ఏకగ్రీవంగా నియమించారు. వైస్ ఛైర్మన్ గా కంజర్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి గంగుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కార్నోల్ల రవి, సహాయ కార్యదర్శి బంగారుగల్ల రవి, సంయుక్త కార్యదర్శి గూడెం బాలరాజు, కోశాధికారి రాధనోళ్ళ రాజు, కన్నుల వెంకటయ్య, కమిటీ సభ్యులు మూర్తి, కమిటీ అడ్వైజర్ సభ్యులు గడ్డ యాదయ్య, డప్పు నర్సింలు, పొట్టల వెంకటేశం, గూడెం మల్లేష్, బంగారుగళ్ళ బిక్షపతి, బంగారుగళ్ల కృష్ణ, కర్నూల్ మల్లేష్ లను కమిటీగా నిమించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన ఆలయ చైర్పర్సన్ గడ్డ పుణ్యవతి మాట్లాడుతూ.. ముత్తంగి జిహెచ్ఎంసి పరిధిలోని పోచమ్మ ఆలయం నూతన కమిటీని అందరు సహాయ సహకారాలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామస్తులందరి సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

# అట్టహాసంగా ముగిసిన చదరంగం పోటీలు

**విజేతలకు నగదు బహుమతి మరియు ట్రోఫీలు అందజేత.**



**కరీంనగర్** కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చైతన్య యూత్ క్లబ్ భగత్ నగర్ లో నిర్వహించిన ర్యాంకింగ్ చదరంగం పోటీలు అట్టహాసంగా ముగిసాయి. ఈ సందర్భంగా జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య మాట్లాడుతూ చదరంగం ఆటతో మేధాశక్తితో పాటు ఏకాగ్రత పెరుగుతుందని అందుకు తల్లిదండ్రులు విద్యార్థులు చదరంగం ఆటపై మక్కువ చూపాలని అన్నారు. జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ పిల్లలలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసమే ర్యాంకింగ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ ఎంటర్ప్రైజెస్ మేనేజర్ శ్రీనివాస్ ఎం డి కుమారస్వామి, చైతన్య యూత్ క్లబ్ సభ్యులు పండగ నాగరాజు, కంకటి సృజన్ కుమార్, తాటి పెల్లి సతీష్ బాబు చదరంగం క్రీడాకారులు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.విజేత లు వీరే..గ్రూప్-ఎ విజేతలు ప్రధమ శ్రీ హన్షిత్, ద్వితీయ స్నితిక్ రెడ్డి తృతీయ సంహిత జి. గ్రూపు బి ప్రధమ ఉమాంగ్ సోనీ ద్వితీయ గాదే శివాన్ తృతీయ వాసుదేవ్ ఎం. గ్రూప్ సి ప్రధమ గుడెల్లి అబ్జుత్తు, ద్వితీయ అశ్రయ తృతీయ విశ్వనాథ్. పి. విజేతలుగా నిలిచారు.

# సారీ' చెప్పడంతో మానవ సంబంధాల పునరుద్ధరణ

## (26 మే "జాతీయ క్షమాపణ దినం" సందర్భంగా)

పొరపాట్లు చేయడం మానవ సహజం. నోరు జారడం నాలుక లక్షణం. అనుకోకుండానో, ఉద్దేశపూర్వకంగానో మనం కొన్ని చిన్న చిన్న తప్పులు చేయడం జరుగుతుంది. మనం చేసిన ఒక చర్య లేదా మన వదిలిన మాటల వల్ల మన మిత్రుల లేదా బంధువుల మనస్సు నొచ్చుకోవచ్చు, మానవ సంబంధాలు బలహీనపడవచ్చు. మన వల్ల జరిగిన పొరపాటుకు తక్షణమే క్షమాపణ తెలుపడంతో అపార్థాల మేఘాలు తొలగిపోయి మళ్లీ పూర్వపు ఆరోగ్యకరమైన సంబంధాలు కొనసాగుతాయి. క్షమాపణ చెప్పడం కూడా ఉత్తమ వ్యక్తిత్వంలో ఓ ప్రధాన కళ అవుతుంది. దీనినే 'క్షమాపణ తెలిపే కళ (ఆర్ట్ ఆఫ్ సేయింగ్ సారీ)'గా వర్ణిస్తారు. క్షమాపణ తెలుపడం అవమానకరం కాదు, అది ఆత్మన్యూనతకు దారి తీయకూడదు. క్షమాపణ చెప్పడం వల్ల మానసిక గాయాలు మానిపోతాయి. నమ్మకాలు/విశ్వాసాలు పెరుగుతాయి. మానసిక సంఘర్షణలు సమసిపోతాయి. మన ఆత్మవిశ్వాసాలు పెరుగుతాయి. భౌతిక దాడుల దారులు మూసుకుపోతాయి. పారదర్శకత చిక్కబడుతుంది. జవాబుదారీతనం పెరుగుతుంది. అపార్థాలతో అభిప్రాయ భేదాలు మొలిచి విడిపోయిన ఇరు పక్షాలను ఏకం చేసే ఉత్తమ సాధనం 'సారీ' చెప్పడమే.

జాతీయ క్షమాపణ దినం–2026 ఇతివృత్తం :

1998లో ఆస్ట్రేలియాలో ప్రారంభమైన "జాతీయ క్షమాపణ దినం" వెనుక ఓ చరిత్ర ఉన్నది. ఆస్ట్రేలియన్ ఆదివాసీ, స్వదేశీ గిరిజల తెగలకు జరిగిన అన్యాయాలను గుర్తించి తెలుసుకొని వారికి క్షమాపణలు తెలుపడానికి జాతీయ క్షమాపణ దినం వేదికలు ప్రారంభమైయ్యాయి. 2026 జాతీయ క్షమాపణ దినోత్సవ ఇతివృత్తంగా "క్షమాపణ నుంచి మానసిక స్వాంతన కూర్చే స్థాయికి ఎదగడం (ఫ్రమ్ సారీ టు ఆక్షన్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయటం జరుగుతోంది. నేటి వ్యక్తిత్వ వికాస పాఠాల్లో క్షమాపణ అడగడం, క్షమించే గుణాలను పెంచుకోవడం కూడా ఓ ప్రధాన కళ అని వర్ణించబడుతున్నది. "ఐ ఆమ్ సారీ" అనే మాటకు ఓ మహత్తర శక్తి ఉంటుంది. మనం కూడా అనుకోకుండా లేదా ఉద్దేశపూర్వకంగా మరొకరి మనసును నొప్పించి ఉండవచ్చని గమనించాలి. మాటల తూటాలకు వదిలి మనసులను గాయపరిచే మహత్తర శక్తి ఉంటుంది. ఒక్క మాట యుద్ధ వాతావరణాన్ని సృష్టించగలదు. దశాబ్దాలుగా ఒకటిగా ఉన్న వ్యక్తులను లేదా కుటుంబాలను ఓ అవాంఛనీయ మాట అడ్డుగోడలను కట్టగలదు. క్షమాపణ చెప్పడంవల్ల మనసు తేలికవుతుంది,ఆరోగ్యం కుదుటపడుతుంది, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. క్షమించడం వల్ల తిరిగి బలమైన మానవ సంబంధాలు,సామాజిక ఆరోగ్యాలు పునరుద్ధరించబడతాయి.

'సారీ' అనే మాట అతి శక్తివంతం :

క్షమాపణ తెలుపడం తప్పు చేసినట్లు కాదని, అనుకోకుండా చేసిన తప్పును సవరించుకునే ఓ అద్భుత అవకాశమని తెలుసుకోవాలి. క్షమించిన వారి కన్న క్షమాపణ కోరి వారికే ధైర్యం ఎక్కువగా ఉంటుందని గమనించాలి. క్షమాపణ చెప్పడం ఓ భావోద్వేగ సంఘర్షణ. క్షమాపణ చెప్పని యెడల జీవితాంతం తప్పు చేశామనే మానసిక క్షోభ మనల్ని వెధిస్తుంది, మనుషుల్ని/మనసుల్ని దూరం చేస్తుంది. ఒక్క 'సారీ' అనే మాట సకల విభేదాలను తుడిచేసి మళ్లీ ఆనందాల అనుబంధాలను కలుపుతుంది. ఒకరిని అపార్థం చేసుకోవడం, అవమాన పర్చడం, అసంబద్ధంగా మాట్లాడడం, అగౌరవ పర్చడం, మనం మాటపై నిలవకపోవడం, ఏక పక్ష తీర్పులు ఇవ్వడం లాంటివి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మన వల్ల పొరపాటు జరిగిందని గమనించి, ఆలస్యం చేయకుండా సారీ చెప్పడం వల్ల ఇరు పక్షాల మనసులు తేలిక పడతాయి, మానవ సంబంధాలు పూర్వపు స్థితికి వస్తాయి. క్షమాపణ చెప్పడానికి బదులుగా కుంటి సాకులు చెప్పడం అనే అలవాటు మంచిది కాదు.

భావోద్వేగ పరిపక్వత, సహానుభూతి, తప్పు చేసామని లేదా జరిగిందని అంగీకరించడం లాంటివి మనకు ఉండవలసిన ఉత్తమ లక్షణాలు. ఒక్క మాట విస్ఫోటనం కాగలదు, విభేదాల మంటలపై నీళ్లు చల్లగలదు. క్షమాపణ చెప్పడం అనేది ఓ నిజమైన కళ. ఇది కేవలం మాటలతో కాదు, మనసుతో, సహృదయంతో చెప్పే ఒక అద్భుత ప్రక్రియ. తప్పు చేసినపుడు క్షమాపణ చెప్పడం ఒక వ్యక్తి యొక్క సానుకూలతను, సమర్థతను తెలియజేస్తుంది. సారీ చెప్పడం ద్వారా సంబంధాలు బలోపేతం కావడం,అపార్థాలుతొలగిపోవడం,లోతైనఆలోచనలకు అవకాశం దొరకడం,వ్యక్తిత్వం ఇనుమడించడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. సరైన సమయంలో క్షమాపణ తెలుపడం సిగ్గుచేటు కాదు, చిన్నతనం కూడా కాదు. అది మన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం అని భావిస్తూ జీవనయానం కొనసాగిద్దాం, మానవ సంబంధాలను పెంచుకుంటూ సాగి పోదాం.

డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి

# తెల్లాపూర్ సరస్సుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి..

## -హైడ్రా కమిషనర్‌ను కలిసిన తేనా ప్రతినిధులు

**రామచంద్రాపురం :**తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ప్రతినిధి బృందం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ను సోమవారం హైడ్రా కార్యాలయంలో కలిసి తెల్లాపూర్ ప్రాంతంలోని సరస్సుల పరిరక్షణ, పునరుద్ధరణకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించింది. తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి నేతృత్వంలో జనరల్ సెక్రటరీ సుధాకర్ అల్లాడి, కమిటీ సభ్యులు దీప్తి రెడ్డి, ప్రదీప్ తదితరులు కమిషనర్‌ను కలిసి మెల్లచెరువు, చెలికుంట, వనం చెరువుల దయనీయ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా తేనా




అధ్యక్షులు ఈశ్వర గారి రమణ మాట్లాడుతూ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఎస్‌టీపీల కొరత, సహజ నాళాల ఆక్రమణల కారణంగా సరస్సులు కాలుష్యానికి గురవుతున్నాయని తెలిపారు.

రింగ్ రోడ్డు పరిధిలో హైడ్రా చేపడుతున్న సరస్సుల పరిరక్షణ చర్యలను ఆయన అభినందించారు. తెల్లాపూర్ సరస్సుల పునరుద్ధరణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

సహజ ఫీడర్ నాళాల పునరుద్ధరణ, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సరిపడా ఎస్‌టీపీల ఏర్పాటు, దీర్ఘకాలిక సరస్సుల అభివృద్ధి చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ త్వరలోనే తెల్లాపూర్ ప్రాంతాన్ని సందర్శించి సరస్సులు, డ్రైనేజీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ- ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంప్) ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది.

**ఏలూరు, మే 25.** ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా కేంద్ర గ్రంథాలయశీ సిబ్బంది చిన్నారుల చేత కథల పుస్తకాలు చదివించడం మరియు చిన్నారుల చేత కథలోని నీతిని చెప్పించడం జరిగింది. అనంతరం ప్రముఖ చదరంగం నిపుణులు యోహాన్ గ్రాండ్ మాస్టర్ చిన్నారులకు చదరంగం నేర్పించడం జరిగింది. తదుపరి కార్యక్రమం డిగ్రీ కళాశాల లెక్చరర్ జి అశోక్ కుమార్ రిసోర్స్ పర్సన్ గా పాల్గొని స్పోకెన్ ఇంగ్లీష్ పై చిన్నారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే తదుపరి కార్యక్రమం ఆంధ్రా డైరీ పత్రిక స్టాఫ్ రిపోర్టర్ చలసాని వెంకట సురేంద్ర రిసోర్స్ పర్సన్ గా పాల్గొని చిన్నారులకు సరదా ఆటలు ఆడిం చారు. ఈ సందర్భంగా చిన్నారులకు కొంత సమయం విరామంలో దాతలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోర్టు అఫిషియల్ రిసీవర్ బాదర్ల ఇందిరా ప్రియదర్శిని బాదర్ల సోమశేఖర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దంపతులు పాల్గొని చిన్నారులకు లస్సీ ఒ స్నాక్స్ పంచి పెట్టడం జరిగింది. అనంతరం చిన్నారులతో మాట్లాడుతూ సెల్ ఫోన్ జోలికి



వెళ్ళవద్దు పుస్తకమే మీకూ సరైన నేస్తం కావున గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలులాంటివి అనిఅన్నారు. తదుపరి కార్యక్రమం ప్రముఖ నృత్య కారులు డాన్స్ మాస్టర్ వై కృష్ణ ఫణి కాంత్ చిన్నారులకు డాన్స్ శిక్షణ అందించారు.అనంతరం జనరల్ నాలెడ్జ్ కాంపిటీషన్ విజేత కు బహుమతులు జిల్లా కేంద్ర



ఉప గ్రంథపాలకులు ఎ నారాయణ రావు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎండీ అస్లాం పాషా, బి రమేష్ , బి వి లక్ష్మీ, మరియు రిసోర్స్ పరన్స్, మరియు చిన్నారుల పేరెంట్స్,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో మహానాడు సన్నాహక సమావేశం

**శెట్టూరు మండలం** అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను పరమార్శించి, వారికి అండగా నిలుస్తా

పసుపు సైనికుల పండుగ(మహానాడు)ను వర్చువల్ విధానంలో జరుపుకుంటున్న సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జులు, క్లస్టర్ ఇంచార్జులు, గ్రామ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో క్లస్టర్ల పరిధిలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు సమావేశాన్ని ప్రజావేదికలో నిర్వహించగ కంబదూరు మండల సమావేశానికి పార్టీ పరిశీలకులు రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ దేశ ప్రధాని పిలుపుతో ఇందన పొదుపు చేయడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయంతో మహానాడను క్లస్టర్ వైస్ గా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు.. పంచాయతీలకు కూడా రాబోయే రోజుల్లో అధికంగా నిధులు రాబోతున్నాయి.. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి కంచుకోటల నిలిపారని, రెండు





రోజుల పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందుబాటులో ఉంచుతామని, ప్రతి గ్రామంలో కూడా ఎన్టీఆర్ విగ్రహాలు, పార్టీ జెండా ఎగురవేసి, ప్రతి ఇంట్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు ఘనమైన నివాళి అర్పించాలని, మన దేశంలో అత్యంత ఎదుగుతున్న నాయకుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ గారు కష్టపడే కార్యకర్తలను గుర్తించి నేడు క్లస్టర్ ఇంచార్జులకు ప్రాధాన్యత ఇచ్చి వారికి తగిన గౌరవం కల్పిస్తున్నారని తెలిపారు..నియోజకవర్గంలోని 11 క్లస్టర్ల పరిధిలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున పసుపు సైనికులు, మహిళలు కూడా పసుపు దుస్తులు ధరించి పెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేయాలని సూచించారు..నాలుగు రోజుల క్రితం కంబదూరు మండలంలో అకాల గాలి వాన భీభత్సానికి అరటి, బొప్పాయి తోటలు ధ్వంశం అయి రైతులు పంట పూర్తిగా నష్టపోయారని మహానాడు తరువాత గ్రామాలకు వెళ్లి రైతులను పరమార్శించి, వారికి ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు..

# దళితుల సమస్యలపై తహశీల్దార్ కి వినతిపత్రం

**శెట్టూరు మండలం** పద్మశ్రీ మందకృష్ణ మాదిగలి నాయకత్వంలో అనంతపురం జిల్లా శెట్టూరు మండలంలో ఉన్నటువంటి దళిత జాతి యొక్క సమస్యలైనటువంటి ఇంటి స్థలాలు లేని పేద ప్రజలకు ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేయమని అలాగే ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన గ్రామకంఠం భూములను గాని, స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న విషయాన్ని మండల పరిధిలో ఉన్నటువంటి అగ్రవర్ణ కులాలకు చెందిన వ్యక్తులు గ్రామాలలో ఆక్రమించుకున్నటువంటి భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసుకున్నారు కావున దీన్ని ఖండిస్తూ అధికారులు దీనిపై అలసత్వం వహించకుండా నిజానిజాలు గ్రామస్థాయిలో వెళ్లి తెలుసుకుని స్థలాలు లేని పేద ప్రజలకు అసలైన అర్హులకు కేటాయించమని మండల తహసిల్దార్ ని కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఒంటిమిద్ది గోవిందప్ప మాదిగ, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి అనంపల్లి రామన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ తాలూకా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాదిగ, గురు ప్రసాద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కుందుర్పి మండల అధ్యక్షుడు సురేష్ మాదిగ, వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొనడం జరిగింది.





# పద్మశ్రీ పురస్కారంతో మెరిసిన హర్మన్‌ప్రీత్ కౌర్

భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం, మే 25, 2026న పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో, దేశ క్రికెట్‌కు ఆమె చేసిన విశేష కృషికి ఈ ఉన్నత గౌరవం దక్కింది. ఆమె నాయకత్వంలోనే గత నవంబర్‌లో భారత మహిళల జట్టు స్వదేశంలో ప్రపంచకప్‌ను గెలిచి చారిత్రక విజయాన్ని అందుకుంది. ఈ విజయంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించడానికి క్రీమ్ రంగు సంప్రదాయ దుస్తులలో హాజరైన ఆమె అందరి దృష్టిని ఆకర్షించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన మొదటి పౌర పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి రెండు పద్మ విభూషణ్‌లు, ఆరు పద్మ భూషణ్‌లు, 58 పద్మశ్రీ అవార్డులను అందించారు. 2026 సంవత్సరానికి మొత్తం 131 పద్మ పురస్కారాలకు కేంద్రం ఆమోదం లభించింది. వీటిలో ఐదు పద్మ విభూషణ్‌లు, 13 పద్మ భూషణ్‌లు, 113 పద్మశ్రీలు ఉన్నాయి. మిగిలిన గ్రహీతలను రెండో విడతలో సత్కరించనున్నారు.క్రీడా రంగం నుండి హర్మన్‌ప్రీత్ కౌర్ తో సహా పలువురు ప్రముఖులకు పద్మ పురస్కారాలు లభించాయి; భారత పురుషుల క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ లభించినా హాజరు కాలేదు. టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్; బల్‌దేవ్ సింగ్, భగవాన్‌దాస్ రాయ్‌క్వార్, కె. పంజనీవేల్, ప్రవీణ్ కుమార్, సవితా పునియాకు పద్మశ్రీలను అందించారు.హర్మన్‌ప్రీత్ కౌర్ తన తరం అత్యంత డైనమిక్, ప్రభావవంతమైన క్రికెటర్లలో ఒకరిగా నిలిచారు. ఆమె నాయకత్వ పటిమ భారత మహిళల క్రికెట్‌ను సరికొత్త శిఖరాలకు చేర్చింది. గత జనవరిలో ఈ అవార్డుకు ఎంపికైన ఆమె, తన విశేషమైన కెరీర్‌లో మరో మైలురాయిని అధిగమించారు.

# పంజాబ్ యంగ్ ప్లేయర్లపై యువీ ఫైర్!



2026 ఐపీఎల్ నుంచి పంజాబ్ కింగ్స్ అనూహ్య రీతిలో నిష్క్రమించింది. తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగని ఆ జట్టు, సెకండ్ హాఫ్‌లో ఘోర ప్రదర్శనతో వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓడింది. ఎట్టకేలకు చివరి లీగ్ మ్యాచ్ నెగ్గినా ప్లేఆఫ్స్ చేరకుండానే ఇంటిబాట పట్టింది. దీంతో ఆ జట్టు వివాదాల్లో నిలిచింది. ప్లేయర్లపై, ఫ్రాంచైజీపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో లీగ్ స్టేజ్ ముగిసిన తర్వాత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ పంజాబ్ యువ ఆటగాళ్లపై చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి. జట్టుకు చెందిన పలువురు ఆటగాళ్లను 'చెప్పులతో కొట్టే సమయం వచ్చింది' అని అన్నాడు. ఈ సీజన్‌లో పంజాబ్ తమ చివరి మ్యాచ్ లఖ్‌నవూతో ఆడింది. ఈ మ్యాచ్ అనంతరం పంజాబ్ కింగ్స్ ఆటగాడు హర్‌ప్రీత్ బ్రార్ తన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశాడు. ఆ పోస్ట్‌లో హర్‌ప్రీత్‌కు ఇరువైపులా బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, ఓపెనింగ్ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య కూడా కూర్చొని ఉన్నారు. ఈ పోస్టులో అతడు అర్ష్‌దీప్ సింగ్‌ను 'బ్లాగర్' అని, ప్రియాంశ్ ఆర్యను 'స్లాగర్' అని హర్‌ప్రీత్ సంబోధించాడు. ఈ పోస్ట్‌కు యువీ స్పందించాడు. "మీ అందరినీ చెప్పు దెబ్బలు కొట్టాల్సిన సమయం వచ్చింది" అని కామెంట్ రాసుకొచ్చాడు. దీంతో ఇది వైరల్‌గా మారింది. వాస్తవానికి అర్ష్‌దీప్, అభిషేక్ శర్మ, ప్రియాంశ్ ఆర్య హర్‌ప్రీత్ బ్రార్‌లాంటి యువ క్రికెటర్లు యువరాజ్‌ను గురువుగా భావిస్తారు. వాళ్లకు యువీ శిక్షణ కూడా ఇచ్చాడు. ఈ సీజన్ ప్రారంభానికి ముందు కూడా యువరాజ్ సింగ్ పంజాబ్ జట్టుకు చెందిన ఈ ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చాడు. ఈ కారణంగానే యువ ఆటగాళ్లు కూడా యువరాజ్ పట్ల ఎంతో గౌరవంగా ఉంటారు. అందుకే తన శిష్యులు చేసే తప్పుల పట్ల యువరాజ్ సింగ్ తరచుగా బహిరంగంగానే తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే వాళ్లపై ఉన్న చనువుతో యువీ అలా అన్నాడన్నమాట!వాస్తవానికి ఈ సీజన్‌లో అర్ష్‌దీప్ సింగ్‌పై పంజాబ్ భారీ అంచనాలు పెట్టుకుంది. కానీ అతడి నుంచి ఆశించిన స్థాయిలో ప్రదర్శన రాలేదు. మొత్తం 14 మ్యాచ్‌లలో అతడు 14 వికెట్లు మాత్రమే తీయగలిగాడు.

# సీఎస్కే జట్టులోకి హార్దిక్ పాండ్యా



ఐపీఎల్ 2026 సీజన్లో ముంబై ఇండియన్స్ జట్టు ప్రదర్శన ఘోరంగా నిరాశపరిచింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టు ఈ సీజన్ లీగ్ దశలో నిలకడైన ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. రాజస్థాన్ రాయల్స్ జట్టు తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో కూడా ఓడిపోవడంతో ముంబై జట్టు ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం 4 విజయాలతో పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పరిమితమైంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు కూడా ఈ సీజన్ ఓ పీడకలలా సాగింది. ఒకవైపు గాయాలు మరోవైపు పేలవమైన ఫామ్‌తో హార్దిక్ పాండ్యా తీవ్రంగా సతమతమయ్యాడు. ఈ సీజన్ ముగిసిన తర్వాత హార్దిక్‌ను ముంబై జట్టు ట్రేడింగ్ ద్వారా వేరే జట్టుకు పంపించబోతోందనే వార్తలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హార్దిక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక ఫోటో నెటిజన్లలో తీవ్ర చర్చకు దారితీసింది.హార్దిక్ పాండ్యా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ ఇంట్రెస్టింగ్ ఫోటోను పంచుకున్నాడు. ఆ ఫోటోలో ఒక లాప్‌టాప్, ఒక నోట్‌బుక్, ఒక పెన్ , హార్దిక్ మొబైల్ ఫోన్ ఉన్నాయి. అయితే ఈ ఫోటోలో క్రికెట్ అభిమానుల కళ్లు నేరుగా హార్దిక్ మొబైల్ స్క్రీన్‌పై పడ్డాయి. ఆ ఫోన్ డిస్‌ప్లేపై సమయం "07:07" అని చూపిస్తోంది. ఈ నంబర్‌ను చూడటమే ఆలస్యం.. సోషల్ మీడియా యూజర్లు దీనికి టీమిండియా లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనీతో లింక్ పెట్టడం ప్రారంభించారు. క్రికెట్ ప్రపంచంలో '7' అనే నంబర్ ధోనీ జెర్సీ నంబర్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సోషల్ మీడియా 7 నంబర్ అనగానే 'తలా ఫర్ ఏ రీజన్" ట్రెండ్ ఎంతలా వైరల్ అవుతుందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు హార్దిక్ ఫోన్‌లో సరిగ్గా 7 గంటల 7 నిమిషాలు ఉన్నప్పుడు స్క్రీన్‌షాట్ తీసి పోస్ట్ చేయడంతో.. ఇదంతా ధోనీ కోసమేనని నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. పైగా వచ్చే సీజన్‌లో హార్దిక్ పాండ్యా ముంబైని వీడి, ధోనీ మెంటార్‌గా ఉన్న సీఎస్కే(చెన్నై సూపర్ కింగ్స్) జట్టులోకి మారబోతున్నాడనే హింట్ ఇవ్వడానికే ఈ పోస్ట్ పెట్టాడంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# గేల్ రికార్డు బద్దలు కొడతా..

ఐపీఎల్ 2026 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. లీగ్ దశలో ప్రపంచ స్థాయి బౌలర్లను కూడా ఊచకోత కోస్తూ తన జట్టును ప్లేఆఫ్స్ చేర్చడంలో ఈ బీహార్ కుర్రోడు కీలక పాత్ర పోషించాడు. ముంబై ఇండియన్స్ జట్టుతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ గెలిచి టాప్–4లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకుపోతున్న వైభవ్ సూర్యవంశీ.. తాజాగా క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే ఓ కీలక ప్రకటన చేశాడు. టీ20 క్రికెట్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కాని రీతిలో డబుల్ సెంచరీ బాదుతానని వైభవ్ సూర్యవంశీ ధీమా వ్యక్తం చేశాడు. ఇటీవల ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ హోస్ట్ చేస్తున్న 'ది స్విచ్' అనే టాక్ షోలో వైభవ్ సూర్యవంశీ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పీటర్సన్‌తో మాట్లాడుతూ.. యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ ఐపీఎల్‌లో నెలకొల్పిన ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగుల (175లి) ఆల్‌టైమ్ రికార్డును తాను బద్దలు కొట్టాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. "నాకు టీ20 క్రికెట్‌లో 200 పరుగులు చేయాలని ఉంది. నేను గనుక ఒక మ్యాచ్‌లో పూర్తి 20 ఓవర్లు క్రీజులో నిలబడి బ్యాటింగ్ చేయగలిగితే.. కచ్చితంగా క్రిస్ గేల్ రికార్డును దాటి డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకుంటాను" అని వైభవ్ సూర్యవంశీ అత్యంత నమ్మకంతో స్పష్టం చేశాడు. 2013 ఐపీఎల్ సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున గేల్ చేసిన 175 పరుగుల రికార్డు ఇప్పటివరకు పదిలంగా ఉంది.ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్న వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 41.64 సగటుతో, ఏకంగా 232.27 అనే అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో 583 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ (హైదరాబాద్‌పై 103 పరుగులు) తో పాటు 3 హాఫ్ సెంచరీలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ రేసులో 5వ స్థానంలో ఉన్న వైభవ్.. లీగ్ దశలో అత్యధిక స్ట్రైక్ రేట్ కలిగిన టాప్–5 బ్యాటర్లలో నంబర్ వన్‌గా నిలిచాడు. సిక్సర్ల సునామీతో మైదానాన్ని హోరెత్తిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. ఈ సీజన్‌లో ఇప్పటివరకు అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా కూడా రికార్డు సృష్టించాడు. కేవలం 14 మ్యాచ్‌ల్లోనే




అతను 53 భారీ సిక్సర్లు కొట్టాడు. 2012లో క్రిస్ గేల్ ఒకే ఐపీఎల్ సీజన్‌లో నమోదు చేసిన అత్యధిక సిక్సర్ల (59) రికార్డును బ్రేక్ చేయడానికి వైభవ్ కేవలం 7 సిక్సర్ల దూరంలో మాత్రమే ఉన్నాడు. మే 27న న్యూ చండీగఢ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో ఈ యంగ్ సెన్సేషన్ ఎలాంటి

# అర్జున్ టెండూల్కర్‌ను చూసి ఎమోషనల్ అయిన సారా!

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమారుడు, యువ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్జున్ టెండూల్కర్ ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తరపున బరిలోకి దిగాడు. లక్నో హోమ్ గ్రౌండ్ అయిన ఏకనా స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా ఆయన ఈ సీజన్‌లో తన మొదటి మ్యాచ్ ఆడాడు. తన అరంగేట్రం మ్యాచ్‌లోనే ఆకట్టుకునే ప్రదర్శన చేసిన అర్జున్‌పై ఆయన తండ్రి సచిన్ టెండూల్కర్, సోదరి సారా టెండూల్కర్ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగంతో కూడిన ప్రశంసల జల్లు కురిపించారు. భారీ స్కోర్లు నమోదైన ఈ ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో అర్జున్ టెండూల్కర్ తన నాలుగు ఓవర్ల కోటాలో 36 పరుగులు ఇచ్చి 1 వికెట్ పడగొట్టాడు. పంజాబ్ కింగ్స్ పరుగుల వేగానికి అడ్డుకట్ట వేస్తూ, ప్రమాదకరంగా మారుతున్న ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ను ఒక పదునైన యార్కర్‌తో హడలెత్తించాడు. చివరకు ఎల్బీగా అవుట్ చేశాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2026లో తొలి వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. తన తమ్ముడు అర్జున్ సాధించిన ఈ విజయాన్ని చూసి సోదరి సారా టెండూల్కర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అర్జున్ ఫోటోలను పంచుకుంటూ ఒక హృదయపూర్వక నోట్ రాశారు. "నువ్వు ఈ ప్రపంచంలోని అత్యుత్తమ విజయాలన్నింటికీ అర్హుడివి నా బుజ్జి తమ్ముడా. నీ కఠిన శ్రమ, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనే నీ సామర్థ్యం, మరియు వీటన్నింటి మధ్య నువ్వు ప్రదర్శించిన ఓర్పును చూస్తుంటే నాకు చాలా చాలా గర్వంగా ఉంది. నిన్ను ఎప్పటికీ ఇలాగే ప్రేమిస్తూనే ఉంటాను" అంటూ సారా టెండూల్కర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో రాసుకొచ్చారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఈ సీజన్ లీగ్ దశలో ఆడుతున్న చివరి మ్యాచ్ వరకు అర్జున్ టెండూల్కర్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం రాలేదు. అయినప్పటికీ పట్టుదలతో ఎదురుచూసిన కొడుకు ఓర్పును తండ్రి



సచిన్ టెండూల్కర్ ప్రత్యేకంగా అభినందించారు. "వెల్ డన్ అర్జున్. ఈ సీజన్ పొడవునా నువ్వు నిన్ను మలుచుకున్న విధానం చూసి గర్విస్తున్నాను. ఎల్లప్పుడూ నీ సామర్థ్యాన్ని నువ్వు నమ్మావు. ఈ సీజన్ చివరి మ్యాచ్ వరకు నీకు అవకాశం రాకపోయినప్పటికీ ఎంతో ఓపికగా ఉంటూ, నిశ్శబ్దంగా నీ పని నువ్వు చేసుకుంటూ, సానుకూల దృక్పథంతో నిలిచావు. క్రికెట్ అనేది ఆటగాడి నైపుణ్యాన్ని ఎంతగా పరీక్షిస్తుందో, అంతకంటే ఎక్కువగా అతడి ఓర్పును కూడా పరీక్షిస్తుంది. ఈ రోజు నువ్వు ఈ రెండింటినీ చాలా అందంగా హ్యాండిల్ చేశావు. నీ కాళ్లు ఎప్పుడూ నేలపైనే ఉండేలా (వినమ్రంగా) చూసుకో, ఈ ఆటను నువ్వు ఎప్పుడూ ప్రేమించినట్లే ఇకముందు కూడా ప్రేమిస్తూ ముందుకు సాగు" అని సచిన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.



# అదరగొట్టిన అర్జున్ టెండూల్కర్..

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున అరంగేట్రం చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 )లో భాగంగా శనివారం పంజాబ్ కింగ్స్ తో జరిగిన పోరులో అతడు ప్లేయింగ్ ఎలెవెన్‌లో ఆడాడు. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ నెగ్గి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. 2025 వరకు కూడా అర్జున్ టెండూల్కర్ ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఒకటి రెండు మ్యాచ్‌లు కూడా ఆడాడు. అయితే 2026 సీజన్‌కు ముందు ట్రేడ్ ద్వారా లక్నో సూపర్ జెయింట్స్‌కు మారాడు. రంజీల్లో కూడా ముంబై తరుపున అవకాశాలు రావడం లేదనే ఉద్దేశంతో గోవాకు అర్జున్ టెండూల్కర్ మారాడు.ఇక లక్నోకు మారిన తర్వాత కూడా అర్జున్ టెండూల్కర్‌కు వెంటనే అవకాశాలు రాలేదు. తొలి 13 మ్యాచ్‌లకు అతడు డ్రింక్స్ మోస్తూ కనిపించాడు. అయితే 14వ మ్యాచ్‌లో లక్నో తరఫున ఆడే అవకాశం వచ్చింది. ఈ సీజన్‌లో లక్నో అట్టర్ ఫ్లాప్ ప్రదర్శన చేసింది. కేవలం 4 మ్యాచ్‌ల్లోనే నెగ్గింది. 8 పాయింట్లతో సీజన్‌ను చివరి స్థానంతో ముగించింది.పంజాబ్ కింగ్స్‌తో జరిగిన పోరులో అర్జున్ టెండూల్కర్‌కు అవకాశం రాగా.. తొలుత బ్యాటింగ్‌లో 5 బంతుల్లో 5 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇక బౌలింగ్‌లో మాత్రం ఆకట్టుకున్నాడు. 4 ఓవర్లు వేసిన అర్జున్ టెండూల్కర్ 36 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. అదే సమయంలో ఎన్నో మ్యాచ్‌ల అనుభవం ఉన్న ఇతర బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

# చరిత్ర సృష్టించిన నొవాక్ జకోవిచ్

## ●ఫ్రెంచ్ ఓపెన్‌లో నొవాక్ జకోవిచ్ శుభారంభం



సెర్బియన్ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. అతడు మాజీ టెన్నిస్ ప్లేయర్ రోజర్ ఫెదరర్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. ప్రస్తుతం రోలాండ్ గారోస్ (ఫ్రెంచ్ ఓపెన్) 2026లో ఆడుతున్నాడు. అయితే ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగడంతోనే నొవాక్ తన కెరీర్‌లో అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. మే 24న ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమైంది. ఈ టోర్నీలో తొలి రోజే నొవాక్ తన మొదటి పోరులో ఫ్రెంచ్ ఆటగాడు గియోవన్నీ మ్పెట్షి పెరికార్డ్‌ను ఢీ కొట్టాడు. అయితే ఈ మ్యాచ్‌లో అతడు గ్రౌండ్‌లోకి దిగడంతోనే రికార్డు సాధించాడు. గ్రాండ్ స్లామ్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో 'మెయిన్ డ్రా'లో అత్యధికసార్లు పాల్గొన్న ఆటగాడిగా నొవాక్ తన పేరును రికార్డుల్లోకెక్కించుకున్నాడు. ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో పాల్గొనడం నొవాక్‌కు ఇది 82వ సారి. ఇందులో రౌండ్ ఆఫ్ 128, రౌండ్ ఆఫ్ 64, రౌండ్ ఆఫ్ 32, రౌండ్ ఆఫ్ 16, క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈ సెర్బియన్ స్టార్ రోజర్ ఫెదరర్ రికార్డును బ్రేక్ చేశాడు. ఫెదరర్ తన కెరీర్‌లో 81 'మెయిన్ డ్రా' మ్యాచ్‌లు ఆడాడు. సుదీర్ఘ కెరీర్‌లో నొవాక్ ఫ్రెంచ్ ఓపెన్‌లో పాల్గొనడం ఇది 22వ సారి. దీంతో ఫ్రెంచ్ ఓపెన్‌లో అత్యధిక సార్లు పాల్గొన్న ఆటగాడిగానూ నిలిచాడు. ప్రస్తుతం ఫ్రెంచ్ స్టార్ రిచర్డ్ గాస్కెట్ (22సార్లు)తో సమానంగా నొవాక్ సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఇక అతడు ఇప్పటిదాకా మూడుసార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గాడు. గతంలో 2016, 2021, 2023లలో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను జకోవిచ్ కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు నాలుగో టైటిల్ సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగాడు.కెరీర్‌లో 22వసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో పాల్గొన్న నొవాక్ టోర్నీలో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో గియోవన్నీ మ్పెట్షి పెరికార్డ్‌పై 5-7, 7-5, 6-1, 6-4 తేడాతో విజయం సాధించాడు. అయితే మ్యాచ్‌లో నొవాక్ మొదటి రౌండ్‌లో తన సెట్‌ను కోల్పోయాడు. ఆ తర్వాత నొవాక్ అద్భుతంగా పుంజుకున్నాడు. వరుసగా మూడు సెట్లలో నెగ్గి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక రెండో మ్యాచ్‌లో ఫ్రెంచ్ ప్లేయర్ వాలెంటైన్ రాయర్‌ను నొవాక్ ఎదుర్కోనున్నాడు. ఈ మ్యాచ్ బుధవారం (మే 27) జరగనుంది.

మంగళవారం, మే 26, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 12

# లక్కీ ఛార్మ్ త్రిష

## ముగ్గురు హీరోలకు బ్లాక్ బస్టర్లు




సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బి÷–గగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది.కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

------

# కేన్ ఫెస్టివల్‌లో మెరిసిన ఐశ్వర్య

## ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన కంగనా



ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్‌తో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు. తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రెడ్ కార్పెట్‌పై  యలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్‌పై నెట్టింట కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. వీటిపై ఐష్ స్పందించనప్పటికీ.. నటి కంగనా రనౌత్ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఐశ్వర్య ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన కంగన అద్భుతంగా ఉన్నారని ప్రశంసించారు. 'ఫ్యాషన్, స్టైల్ అనేది ఎవరికి నచ్చినట్లు వారు ఎంపిక చేసుకునేవి. వారి ఇష్టానికి, సౌకర్యానికి తగినట్లు ఉంటాయి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు. ఆమెను మరేదైనా స్టైల్‌లో చూడాలనుకునే వారు మొదట మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించవచ్చు కదా?.. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎప్పుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లలో ఉన్నవారు కూడా మెరుస్తారు. వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే ఇకనైనా అలవాటు చేసుకోండని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో మే 12 నుంచి 23 వరకూ సందడిగా జరిగింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'లుమినారా' అనే డీప్ సెర్–బ్లూ గౌన్‌లో ఐశ్వర్య రెడ్ కార్పెట్‌పై నడిచి అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. రెండోరోజు వైట్ డ్రెస్‌తో ఫొటోలకు పోజులిచ్చారు.


# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర




కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.

# పర్సెంటేజీల కోసం ఎగ్జిబిటర్ల ఆందోళన

## రంగంలోకి దిగిన మెగాస్టార్ చిరంజీవి




తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గత కొన్ని రోజులుగా నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అంశంపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి ఈ సమస్య పరిష్కారానికి స్వయంగా ముందుకు వచ్చారు.  తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉంది. అయితే సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్స్‌డ్ రెంటల్ పద్ధతినే కొనసాగిస్తున్నారని ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి క్లిష్టంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే స్థిర అద్దె చెల్లించాల్సి రావడం తమపై తీవ్ర ఆర్థిక భారం పెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న రెవెన్యూ షేరింగ్ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా విడుదల సమయంలోనే ఈ వివాదం మరింత వేడెక్కింది. 'పెద్ది' సినిమా నుంచే పర్సంటేజ్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.  పరిశ్రమలో పెద్ద సమస్యలు వచ్చినప్పుడు ముందుండి స్పందించే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈసారి ఒకవైపు తన కుమారుడు రామ్ చరణ్ సినిమా విడుదల, మరోవైపు థియేటర్ల యజమానుల సమస్యలు ఉండటంతో ఆయన ఈ వివాదంలో జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది

# రామాయణ్‌కు హన్స్ జిమ్మర్ సంగీతం అదనపు ఆకర్షణ


## రామాయణ విదేశీయులను కూడా ఆకర్శించడం ఖాయం




హిందీలో తెరకెక్కుతున్న ఇతిహాసం 'రామాయణ్'పై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ తివారీ  దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అద్భుత కావ్యం ఇండియాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఏఆర్ రెహమాన్ అన్నారు. దాదాపు 4000 కోట్ల బ్జడెట్‌తో నమిత్ మల్హోత్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ గొప్ప ఇతిహాసం గురించి ప్రపంచానికి తెలియాలన్నదే నిర్మాతగా ఆయన ఆకాంక్ష. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్‌తోపాటు హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ కూడా పని చేస్తున్నారు. ఆయనతో కలిసి పనిచేయడం గురించి తాజా ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడారు. 'సంగీత ప్రపంచంలో ఆయనది విభిన్నమైన శైలి. మాది గొప్ప స్నేహం. మన దేశానికి, సంస్కృతికి సంబంధించిన గొప్ప చిత్రానికి మేమిద్దరం కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. జిమ్మర్‌ను ఈ కథలోకి తీసుకురావడం అంటే ఆయన్ను ప్రపంచ వేదికపై ఒక అంబాసిడర్‌లా నిలబెట్టడమే. ఆయన వల్ల విదేశీయులు కూడా ఈ చిత్రాన్ని వీక్షిస్తారు. ఒక భారతీయ సినిమాకు హన్స్ జిమ్మర్ ఎలాంటి సంగీతాన్ని అందించారో చూడాలనే ఎగ్జైట్‌మెంట్‌తో ఫారినర్స్ సైతం థియేటర్లకు వస్తారు. అలాంటి గొప్ప కళాకారుడితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. అలాగే నా కెరీర్‌లోనే ఇదిఅతిపెద్ద చిత్రాల్లో ఒకటి. కథ పరంగానే కాదు అన్నివిధాలా ఇది ఆడియన్స్‌ను అలరిస్తుంది. ఈ సినిమా కోసం ఉపయోగిస్తున్న లేటెస్ట్ టెక్నాలజీ సినిమాను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్తుంది. దీని ట్రైలర్ త్రీడీలో చూశాను. అద్భుతంగా ఉంది. ఇండియాలోనే కాకుండా గ్లోబల్ స్థాయిలో ఈ తరహా చిత్రాన్ని చూడలేదు. త్రీడీ విజువల్స్, మ్యూజిక్ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఇది భారతదేశంలో రూపొందిన అద్భుతమైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుంది' అని రెహమాన్ అన్నారు.

రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతోంది. మొదటి పార్టు ఈ ఏడాది దీపవళికి విడుదల కానుంది. ఇందులో యశ్ రావణాసురుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా కనిపించనున్నారు.

# ఫ్లాప్ ఇచ్చిన హీరోపై కూడా 100 కోట్లు పెట్టేస్తున్నారు: తమ్మారెడ్డి భరద్వాజ



టాలీవుడ్ దర్శక నిర్మాతగా తమ్మారెడ్డి భరద్వాజకి మంచి పేరు ఉంది. ఆయన కెరియర్ మొదలై 50 ఏళ్లు అవుతోంది. అయితే 15 ఏళ్లుగా నిర్మాతగా ఆయన నుంచి సినిమా రాలేదు. అలాంటి ఆయన నుంచి 'వదలా' అనే సినిమా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. జగపతిబాబు – లయ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, ఆకెళ్ల వి.కృష్ణ దర్శకత్వం వహించాడు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ తో తమ్మారెడ్డి భరద్వాజ బిజీగా ఉన్నారు. "ఒకప్పటికంటే ఇప్పుడు టెక్నాలజీ పెరిగింది. కాకపోతే అప్పటికంటే ఇప్పుడు కాస్త కాంప్లికేట్ అయింది. క్వాలిటీ పరంగా చూసుకున్నప్పటికీ, ఆ రోజులలో వచ్చిన సినిమాలు ఏ మాత్రం తగ్గకపోవడం కనిపిస్తుంది. అప్పటికి ఆ సినిమాలు .. ఇప్పటికి ఈ సినిమాలు అనుకోవాలంతే. ఒకప్పుడు హీరోలు ఎక్కువ సినిమాలు చేసేవారు. ప్రేక్షకులు థియేటర్స్ కి ఎక్కువగా వచ్చేవారు. అయితే ఇప్పటి హీరోలు సినిమాల సంఖ్య తగ్గించుకోవడానికి, ఆడియన్స్ థియేటర్స్ వరకూ రాలేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి" అని అన్నారు. "ఎప్పుడూ కూడా 95 శాతం సినిమాలకి డబ్బులు పోతాయి. 5 శాతం మాత్రమే సినిమాలకు డబ్బులు వస్తాయి. అందువలన నిర్మాతలు భయపడుతూనే సినిమాలు తీస్తూ ఉంటారు. సినిమా ఏదైనా ప్రొడ్యూసర్ .. డిస్ట్రిబ్యూటర్ .. ఎగ్జిబిటర్ అందరూ ఫేస్ చేయవలసిందే. పారితోషికం విషయానికి వస్తే, నిర్మాతలు ఇస్తున్నప్పుడు హీరోలు తీసుకుంటారు. ఫ్లాప్ ఇచ్చిన హీరోకి పారితోషికం పెంచి తీసుకునే నిర్మాతలు ఉన్నారు ఇప్పుడు. తీసుకోవడాన్ని హీరోలు తగ్గించాలని అనడం కంటే, ఇవ్వడాన్ని నిర్మాతలు తగ్గిస్తే సరిపోతుంది" అని చెప్పారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district.    TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com